శేష జ్యోత్స్న

కవిత

గుంటూరు శేషేంద్రశర్మ

(ب)

PS01K371
రద్దాకాలి

శేషజ్యోత్స్న

(కవిత)

గుంటూరు శేషేంద్రశర్మ

ఇది ఉర్దూ హిందీ ఇంగ్లీషు భాషల్లోకి తర్జుమా చేయబడి
ప్రకటితమయింది.

ప్రథమ ముద్రణ :

1972

పీటిని ప్రకటించిన ఆంధ్రపత్రిక
నచిత్ర వారపత్రికవారికి, ఆకాశ
వాణివారికి నా కృతజ్ఞత.

హక్కులు రచయితవి:

దొరుకుచోటు :

1. సి. యల్. యన్. బుక్‌షాపు
నాంపల్లి స్టేషన్‌రోడ్డు, హైదరాబాదు.

2. ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్
3287 రాష్ట్రపతిరోడ్డు, సికింద్రాబాదు.

ముఖచిత్రం:

శ్రీ శీలా వీర్రాజు

ప్రచురణ:

ఇండియన్ లేంగ్వేజస్ ఫోరం
జ్ఞాన్‌బాగ్ ప్యాలెస్, గోషామహల్,
హైదరాబాదు.

ముద్రణ :

ప్రగతి ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాదు.

891.527 1(9)
శే. గి — శై
3036

సూచిక

	పుట
ఉపోద్ఘాతం (Dialogue Across Time) గుంటూరు శేషేంద్రశర్మ	iv
ఉర్దూ తర్జుమాకు అక్తర్‌హసన్‌గారి ఉపోద్ఘాతము	xvi
హిందీ లివ్యంతరీకరణకు డా. తెలంగ్ ఉపోద్ఘాతం	xxi
పడవలు - తెరచాపలు	1
ఆ రెండుకళ్లు	5
నూతన తీరాలు	8
నీవు	13
చీకటి దయ్యాలు	18
ఏవో చినుకులు	21
ఈ రాత్రి	24
ఒక్కక్షణం	27
మళ్ళీవచ్చింది కోకిల	31
గోపురాలు	33
వెన్నెలవ్యధ	35
ఉషస్	37
నిశ తెచ్చిన కానుక	39
ఆరోజు	41
మనసే ఒక మధుమాసం	43
గాలులు	46
మనిషి	48
తరాల తరంగాలు	50
నిదురలోయల్లో	52
అందాల అతిథులకోసం	54

నేనూ - నానెమిలీ లేక నెమిలీ - నానేనూ

(నా పుస్తకానికి నా ఉపోద్ఘాతం : A Dialogue Across Time)

ఆ యింట్లో ఒక తోట – ఆ తోటలో ఒక నెమిలి – ఆ నెమిలిలో ఒక – కాదు నా గుండెలో ఒక యిల్లు – ఆ యింట్లో ఒక తోట – ఆ తోటలో ఒక నెమిలి – ఆ నెమిలిలో ఒక ఏదో.....చెపుతా – నేనెక్కడుంటే అక్కడికి వస్తుంది ఆ నెమిలి. నేను వ్రాసుకుంటూనో, చదువు కుంటూనో దాన్ని గుర్తించక పోతే, నా వైజమా తన ముక్కుతో లాగుతుంది, నా కాలి వేళ్ళని సున్నితంగా పొడుస్తుంది; నేను తలయెత్తి చూచేసరికి మెడజాపి మోరఎత్తి ఆ చిన్ని కళ్ళతో నా వైపు చూస్తూ ఉంటుంది. పనివిల్లవాడు తల్లి దగ్గర చేసినట్లు తినడానికి పెట్టమని గొడవ చేస్తుంది - కొక్కొక్కో అంటూ; ఆ పెట్టిన వి జొన్నలో బియ్యమో నేల మీద వేస్తే తినదు; కొక్కొక్కో అంటూ వెనక్కి వెనక్కి అడుగులు వేస్తూ ఉంటుంది; చేత్తో పెడితే సంతోషంగా తింటుంది. కడుపు నిండిన తర్వాత-నేను వ్రాసుకుంటూ ఉంటే అక్కడే ఉంటుంది, ఆ పరిసరాల్లోనే తిరుగుతూ, అప్పుడప్పుడూ కొక్కొక్కో అంటూ, నేనిక్కడే ఉన్నానని జ్ఞాపకం చేస్తూ.

నేనలసిపోయి ఇంటికి రాగానే ఎక్కడ్నించో వచ్చేస్తుంది నా దగ్గరకు ఆ నడిచే రంగుల విందు, మేఘ విహీనాల్లోకి ఇంద్ర ధనుస్సు పచ్చినట్లు. పాపం మాట్లాడలేదు. తన భావం చెప్పలేదు; ఒక సముద్రం తనలో మోషిస్తోంది బంధాలు తెంచుకుని బయట పడ్డానికి; విఫలమై ఉద్రేకిస్తుంది. ఆ జీవి ఎంతబాధ పడుతుందో లోపల; సృష్టికర్తను ఎంత నిందిస్తుందో తన వైకల్యానికి.

ఒక రోజు నేను చచ్చిపోయాను: నా గదిలో అందరూ ఏడుస్తున్నారు. అదిగో నెమిలి: మెల్లగా బెదురుతూ వస్తూ ఉంది. మనుషులు గుంపులు కూడిన ఆగదిలోకి, నాలుగు వైపులా మొహం తిప్పుతూ ప్రాణభయంతో వస్తూ ఉంది. ఎంత ప్రాణభయ మయినా గదిలోకి ఏదో తనని లాగుతూ ఉన్నట్లుగా నా వైపు

వస్తూఉంది. ఏది లాగుతూ ఉందో నాకు తెలుసు; (చాలా మందికి తెలీదు. అదే ఈ లోకపు దురదృష్టం) మృత్యు భయం దాన్ని నివారించలేక పోయింది; తేను చచ్చిపోయాను; కానీ ఈ విచిత్రం మాత్రం చూస్తున్నాను. చాలామంది నా దేహం మీద పడి ఏడుస్తున్నారు.

తటాల్న గయ్ దె మొపాసా కథ "ప్రేమ" నా మనస్సులో మెరుపు తీగెలా మెరిసింది. ఆ కథలో వేటగాడు ఒక పక్షుల జంటలో ఆడపక్షిని తుపాకితో కాల్చివేస్తాడు. అది నేల మీద పడుతుంది. స్నేహితుడితో అంటాడు," చూడు, తుపాకిగురి చూస్తూ కూడా రెండో పక్షి తప్పకుండా తుపాకి పరిధిలోకి వస్తుంది. (ఇలాంటి జంటలో ఒకదాన్ని కొడితే రెంటినీ కొట్టినట్టే)". అలాగే ఆకాశంలో వలయాలు చుడుతూ హృదయ విదారకంగా రోదన చేస్తూ నేలమీద రక్త ప్రవాహంలోవడి ఉన్న ఆడపక్షి వైపు వస్తూఉంది ఆ రెండోది. భయం అన్నమాట మరచిపోయి తుపాకి పరిధిలోకి వచ్చింది. రాగానే-వేటగాడు వేటగాడే గదా – తుపాకి వేల్చాడు. మగపక్షి ఆకాశం నించి రాలి పడిపోయింది నేలమీద ఆడపక్షి ప్రక్కన.

వెంటనే నాకు వినిపించింది, కఠోరంగా శపిస్తున్న ఒక పురాతన గొంతుక: నాకు తెలుసు అది వాల్మీకి. ఆ గొంతు మొపాసా వేటగాడ్ని తిడుతూఉంది. వాల్మీకి ఒక నిక్కరు, బూట్లు వేసుకొని ఉన్నాడు, తల మీద ఒక దొరటోపీ ఉంది; ముఖంలో నిశిత బాధా రేఖలు అలముకో ఉన్నాయి. ప్రక్కన స్నేహితుడి చేతిలో తుపాకి పొగలు కక్కుతూఉంది. నేను నా చావుసంగతి మరచిపోయి దిగ్భ్రాంతుడ్నయ్యాను. ఈ గొంతే మునుపు ఒక వేటగాడ్ని తిట్టింది. ఇప్పుడు మరొకడ్ని తిడుతూంది. ఈ గొంతు ఎప్పుడూ ఇలా తిడుతూనే ఉంటుందా అన్ని కాలాల వేటగాళ్ళనీ? మానవతకు గాయాలు చేసే వాళ్ళనీ, ద్వేషాన్ని, స్వార్థాన్ని రక్తాక్షరాల్లో రాసే వాళ్ళనీ ... కాలపు రస్తాలో, దాడులు జరిపే బందిపోటు దొంగలనుంచి మానవతను రక్షించడానికి అహరహమూ పహారా కాచే పోలీసా ఏమిటి ఈ గొంతు: విశ్వంలో మహనీయత శబ్దంగా మారుతుంది. ఆ శబ్దం శాశ్వతంగా లోకమంతటా పరిభ్రమిస్తూ ఉంటుంది, యుగం నించి యుగానికీ, దేశం నించి దేశానికీ, భాషనించి భాషకూ, అనంతంగా నిరంతంగా.

ఒకనాడు 21వ శతాబ్దం సాయంకాలం నేనూ, ఆల్బర్ట్ కేమ్యూ ఒక పార్కులో స్విమ్మింగ్ పూల్లో ఈదుతున్నాము. ఆ రక్తంలో తడిసిన మేము ఒక్కసారే ఉదయించిన రెండు అరుణబింబాల్లా ఉన్నాము. నేనన్నాను, "కేమ్యూ! హింసాద్వేషాలనుంచి ఏ మహాకావ్యమూ ఉద్భవించదన్నావు. మరి మన మీదుతున్న ఈ రక్తపూర మేమిటి? మనిషిమీద ప్రేమచేతనే గదా ఈ రక్తం ప్రవహించింది? ఈ రక్తం పారకపోతే అదిగో ఆ పసిపిల్లలు అలా ఆ పువ్వుల్లో ఆడుకుంటూ ఉండేవాళ్ళుకారు, ఉదయాస్తమయాలు అందరికీ ఇన్ని రంగులూ హంగులూ వెలార్చేవికావు". కేమ్యూ మాట్లాడే లోపుగానే, గట్టు మీద పూచిన కుసుమలత ప్రక్కన కూర్చుని ఉన్న కాఫ్కా అన్నాడు, "ఈ రక్తప్రవాహం కావాలి. కానీ అందులో కొందరు పడవలు వేసుకొని ప్రయాణాలు చేస్తున్నారు కీర్తిశిఖరాలకు. వాళ్ళ లక్ష్యం కీర్తిశిఖరాలే గానీ ఈ రక్తం ఎవరిదో ఎవరి కోసం పారిందో వారి క్షేమం కాదు. వాళ్ళు తమ రక్తం ఒక్కబొట్టు కూడా కార్చరు. పరాయివాళ్ళ రక్తం పారితే పాటలు రాస్తాం అంటారు."

భవభూతితో కలిసి ప్లాటో ఏదో చిత్రం పరిశీలిస్తున్నాడు. "ఇది థాయ్‌లెండులో గీచిన హనుమంతుడి చిత్రం" అన్నాడు భవభూతి. "ఇది కాలాంబుధి ఈది వచ్చే మానవతా సందేశం" అన్నాడు ప్లాటో. ఇంతలో కాఫ్కా అన్నమాటలువిని, "ఫ్రాంజ్, ఈ పడవ ప్రయాణాల వైరేట్లు ఎప్పుడూ ఉన్నారు. మా గురువుగారి చేత హాలాహలం త్రాగించిన వాళ్ళు వీరే, ఆయన చచ్చాం తర్వాత ఆయన మతానికి గురువులై కూర్చుందీ వీరే. చిత్తశుద్ధిలేనివాళ్ళు ఎప్పుడు లేరు? వాళ్ళల్లోవాడే గతసంవత్సరం సిస్టీన్ చాపెల్‌లో ఉన్న వియేటా మాతృవిగ్రహం ముక్కూ చేతులూ పిరగ్గొట్టాడు. హాలాహలంతాగే ముందు మా గురువుగారు అన్న మాటలు ఇప్పటికీ ప్రతిధ్వనిస్తున్నాయి.

"ఓ న్యాయాధికారులారా! మీరు సంతోషంగా ఉండండి..... నేను వెళ్ళిపోవలసిన కాలం ఆసన్నమయినట్లు నాకు స్పష్టంగా తెలుస్తూ ఉంది. ఇక నేను మరణించడమే మంచిది; ఈ బాధనించి విముక్తుడ్నవుతాను... నాపైన నేరారోపణ చేసినవాళ్ళమీదగానీ, నాకు శిక్షవిధించిన వాళ్ళమీదగానీ

నాకు ఏమాత్రమూ కోపంలేదు. పాపం! వాళ్ళు నాకు ఏ అపకారమూ చెయ్యలేదు; ఉపకారం చేద్దామన్న తలపు లేకపోవచ్చు. దానికి వాళ్ళని సున్నితంగా మందలిస్తాను.

కానీ వాళ్ళని నాకొక్క ఉపకారం చెయ్యమని కోరుతున్నాను. నా కొడుకులు పెద్దవాళ్ళయిన తరువాత వాళ్ళనుకూడా ఇలాగే శిక్షించమంటాను; నేను మిమ్మల్ని వేధించినట్లే మీరు వాళ్ళని వేధించండి, వాళ్ళు నంస్కారాని కంటే నంవదకు విలువయిస్తే, వాళ్ళు ఏదీకాకపోయినా ఏదోఅయినట్లునటిస్తే; అప్పుడు వాళ్ళని విమర్శించండి నేను మిమ్మల్ని విమర్శించినట్లు, వాళ్ళ అపనవ్యపు విలువల్ని వాళ్ళ మిథ్యాస్వరూపాన్ని ఖండించండి. మీరు నిజంగా ఈపనిచేస్తే మీ చేతులతో నాకూ, నాపిల్లలకూ న్యాయభిక్ష పెట్టినవాళ్ళవుతారు." మా గురువుగారు తాగింది హాలాహలం కాదు; చిత్తశుద్ధికి నికషోపలం." తదేకధ్యానంగా వింటున్న ఇక్బల్ అన్నాడు,

"కాలానికి ముందుగా పుట్టి కాలానికి బలి
అయిపోయాడు, ఎన్నో అనంఖ్యాక నక్షత్రాలు
హతమయిన తర్వాతనే లోకానికి ఒక
అరుణోదయం కలుగుతుంది."

600 ఏళ్ళ తర్వాత ఆయనే క్రీస్తనే పేరుతోపుట్టాడు. క్రీస్తుగా పుట్టడానికి 100 ఏళ్ళముందు మహాకవి వర్జిల్ మనస్సులో మెరుపుతీగెలా మెరిశాడు. ఆ మహాకవి తన (iv) ఇకొలోగ్స్‌లో "ఆ దివ్యజ్ఞాన గీతంలో చరమఘట్టం ఇప్పుడు వస్తుంది. మహాశకాల పరంపర మళ్ళీ పుడుతుంది. ఆ కన్య మళ్ళీ తిరిగివస్తుంది...; ఇప్పుడు ఒక క్రొత్తజాతి సువర్లోకంనించి భువర్లోకానికి అవతరిస్తుంది. ఓ నిర్మలదేవతా, ల్యూసీనా! ఈ కొత్తగాపుట్టిన శిశువుమీద నీ కరుణామయ మందహాసాలు చిలుకరించు, ఈ శిశువు కాలంలో ఇనుపజాతి అంతరిస్తుంది; సువర్ణజాతి ఉదయిస్తుంది; ప్రపంచమంతటా వ్యాపిస్తుంది..." అని గానంచేశాడు. కనకనే ఆయన్ని ఈనాడు క్రీస్తుకు పూర్వమే పుట్టిన క్రిశ్చియన్ అంటారు.

ఒకనాడు టెలివిజన్‌లో మెక్‌డయార్మిడ్ ముఖం — ఆయన తన "థర్డ్ హిం టు లెనిన్" పాడుతున్నాడు.

"మైకేల్ రాబర్ట్స్, ఇంకా ఇతర దేవదూతలూ, ఓడెన్, స్పెండర్... వీరెవరికీ కార్లయిల్‌కున్న ధైర్యంలో నీతిలో పదోభాగం లేదు. ఆ వంచకుల్లా కాక నేను శ్రామికవర్గంలోవాడ్ని; శ్రామికులకోసం కృషి చేస్తున్నానని గొప్పలుచెప్పుకునే వాళ్ళలో ఒకడ్నికాదు, శ్రామికుడ్నే..."

నేనన్నాను, "బాబూ చాలా చక్కగాచెప్పావు బాగుంది. ఒక చిన్న సంఘటన చెపుతాను – మొన్న "19వ శతాబ్దపు ఫ్రెంచి కవిత" అనేది నాదో పుస్తకం పుస్తకాల అలమారులోనుంచి అదృశ్యంఅయింది. ఎవడో చెప్పకుండా పట్టుకుపోయాడే దొంగవెధవ అని కొన్నాళ్ళు వాపోయాను. కానీ ఒకనాడు అది కనిపించింది, ఒక ఆధునిక (కు) కవి వచనకవితలో!"

"ఎవడండీ వాడు, మీ తెలుగువాడేనా ఏమిటి?" అన్నాడు పూర్ మెక్‌డయార్మిడ్—

రాత్రి పచ్చిందో కల, టెక్నికల(ర్) — అంతరంగంలో మల్టీడైమెన్షన్ తెరమీద దృశ్యాలు. జ్లాఁ కోక్తో, నేనూ కూర్చుని నల్లమందు పొగతాగుతున్నాము. "వృక్షజాతి పదార్థాల్లో నల్లమందొకటే మనకు వృక్షస్థితిని నిర్ధించ జేస్తుంది. దానిమూలంగానే వృక్షకాలంలో ఉన్న ఒక అవ్యక్తమైన వేగం మనకు తెలుస్తుంది. మామూలుగా నిశ్చలంగా కనిపిస్తాయి. కానీ వాటికున్న వేగం మన అసమర్థ ఇంద్రియాలు అనుమానించనుకూడా లేవు" అన్నాడు కోక్తో. ప్రక్కనే ఉన్న పికాసో అన్నాడు, "నల్లమందు వాసన ప్రపంచంలో చాలా తక్కువ అసహ్యత ఉన్న వాసన. ఆ వాసనతో పోల్చతగింది నర్కసు వాసన గానీ లేక ఓడరేవు వాసనగానీ". కోక్తో "ఆ వాసన ఎంత ఇంద్రజాలం చెల్లుతుందో చెప్పలేను. ఈగలు నాలుగుదిక్కుల్నుంచీ వచ్చి ముసురుకుంటాయి, వాటి తలల్లో స్వప్నాలు ముసురుకుంటాయి. బల్లులు గోడల కంటుకుని మూర్ఛ పోతాయి. రాత్రి రాకకోసం నిరీక్షిస్తాయి."

నేనన్నాను, "నల్లమందు మా ఖండంనించి మీరు తెచ్చుకున్నారు. కానీ దాని మర్మం మీకు తెలిసినంతగా మాకు తెలీదు". కోక్తో అన్నాడు—"యువ ఏషియా దానిపొగ ఇప్పుడు తాగదుఎందుచేతనంటే వాళ్ళతాతయ్య తాగేడుకనక; యుపయూరోప్ తాగుతుంది. ఎందుకంటే వాళ్ళతాతయ్య తాగలేదుకనక.

దురదృష్టం ఏమిటంటే యువఏషియా, యువయూరోపును అనుకరిస్తూ ఉంది. కనక, నల్లమందు మా ద్వారానే మళ్ళీ తన జన్మస్థానం చేరుకుంటుంది.'

ఇలా సంభాషణ సంచరిస్తోఉంటే నామనస్సు కర్పూర పరాగంలా గాలిలో కలిసిపోతూఉంది. ఇలా ఉండేమిటి అన్నాను.

కోక్తో—"మేలుకోడానికి ప్రయత్నించకు. దాని మృదులాంగుళుల ఉపలాలనకు లొంగు. ఒక్కసారి కవి మేలుకున్నాడంటే వాడు వట్టి చవట—అంటే మేధావి అన్నమాట. నే నెక్కడున్నాను అంటాడు మూర్ఛపోయి తేరుకున్న ఆడదానిలా. మేలుకొనిఉన్న కవిరానే రాతలు చదవటం నిష్ప్రయోజనం."

నేనన్నాను "మరి కలల్లో తలమునిగిన కవిరానే రాతలు ఎవరి కర్థమవుతాయి—"

"రాజకీయవాది అయితేతప్ప కవిఅయినవాడు, తన భాష అర్థమయిన పాఠకుల సంఖ్యమీదనే ఆధారపడాలి. తనభాష గొంతుక పోల్చుకోగలిగినవాళ్ళు. తనభాష అంతరాత్మను పసిగట్టగలిగినవాళ్ళు తన పాఠకులు; ఎక్కువమంది కోసం ఆశించటం కవిలక్షణం కాదు" అన్నాడు కోక్తో.

ఇలియట్ అందుకుని "నేను నీతో ఏకీభవిస్తాను. రాజకీయ సంబధం కవిత్వానికి తక్షణం గుర్తింపు తీసుకురాగలదు కానీ రేపుకూడా ఆ కవిత్వం చదవబడిందంటే ఆ రాజకీయ సంబంధం ఉందనికాదు; లేకపోయినా చదవబడేదే, అది నిజంగా కవిత్వమయితే. ఎంచేతసంటే రాజకీయ పదార్థంకూడా మానవీకరింపబడి కవితగా మార్చబడకపోతే అది చదివి మరిచిపోవడానికి మాత్రమే అర్హమవుతుంది" అన్నాడు.

"సరే ఇలియట్. నీవు ఇడియట్ అవుతేగానీ కవిత్వం చెప్పలేవు. నల్లమందు పొగతాగితే నీవు నీలో ఉండవు. నీ బాహువుల్లో నీతల దాచుకో. భుజానికి చెవి జోడించు - ఇకచూడు - భూకంపాలు, విప్లవాలు, కర్మాగారాలు పేల్తపోవడం, సైన్యాలు సైన్యాలే పారిపోవడం, మహాప్రవాహాలు ముందుకు దూకడం—ఎన్నోచిత్రాలు నీ శరీరాంతర్గత సీమల్లో నక్షత్రాలు క్రిక్కిరిసిన రాత్రిలో నీచెవి దర్శిస్తుంది.

అప్పటికే నాలో కాలమూ దూరమూ అంతర్థానమయ్యాయి. శబ్దాలు నముద్రాలు వాటి సంగీతం విజృంభిస్తున్నాయి. ఆ అవ్యక్త మానసిక సముద్ర తరంగాల్లో తన "మచ్చా విచ్చా" పద్యంపట్టుకుని పాబ్లో నెరూడా ఉదయించాడు, "ఉదయించు తమ్ముడా నాతో మరోసారి ఉదయించు" అని కేకవేశాడు మరొకసారి కెరటాలమీద పాదఘట్టన చేస్తూ "నీవు ఇక్కడ పాతివెట్టిన ఆ బానిసను తీసుకోనీ నన్ను, దళితజీవుల రొట్టెను ఈ భూమిసించి లాగి వేసుకోనీ" అని ఆకోశించాడు.

నల్లమందు పొగ గదినిండా కమ్ముకుంది. గోడలమీద బల్లులు, ఈగలు దోమలు కలలఅలల్లో తేలిపోతున్నాయి. పసుపువన్నె కలలు ముసురుకుంటున్నాయి. గౌరవర్ణ జాతుల కంఠాలు వినిపిస్తున్నాయి. ఇషికవాటకుబొకు, తన లోతైన జపానీ గొంతుతో గానంచేస్తున్నాడు. "నేనొక దుఃఖభాజనుడ్ని. నేను బలహీనుడ్ని కానీ నాచేతిలో ఒక అద్వితీయమైన భయంకర ఖడ్గంఉంది. నేను యుద్ధం చేయకపోతే దాన్ని నేను సహించలేను. కానీ నేను జయించలేక పోతున్నాను. అంటే ఇక మరణమే నాకు శరణమన్నమాట. కానీ నాకు చావంటే పరమభీత. నాకు చావడం ఇష్టంలేదు. మరి బ్రతకడం ఎలా?"

ఏ ప్రేమ మానవతకు రూపాంతరమో, చిత్తశుద్ధికీ, నీతికీ, ధైర్యానికీ మారుపేరో, ఏ ప్రేమ ఇద్దరు పరస్పర అజ్ఞాతవ్యక్తుల్ని విలీనంచేసి సృష్టి అనంతతను ఆవిష్కరిస్తుందో. ఏ ప్రేమ సర్వమానవజాతినీ ఒక్క చరిత్ర మానలో వేసి మానవతాహిరణ్యంగా మలిచివేస్తుందో. ఏ ప్రేమచేత మనిషి, తోటిమనిషి బాధచూచి దగ్ధవిస్తాడో, ఏ ప్రేమచేత మనిషి అన్యాయంమీద దౌర్జన్యంమీద తన ఇనపపిడికిలి ఝళిపిస్తాడో, ఏప్రేమవల్ల మనిషిన్యాయాన్ని నిరోధించే శక్తుల్ని తన పవిత్ర కర్కశ పరశువుకి బలిచేస్తాడో, గాయపడ్డ మానవతకి రక్తంతో తర్పణంచేస్తాడో, ఆ యుగయుగాల శిక్షాఫలితంగా మానవుడు సాధించి రక్తకణాల్లో నిక్షిప్తంచేసుకున్న సంపదను కాలితో తన్నేవాళ్ళు కవిత్వం చెపుతున్న ఈరోజుల్లో, దాన్ని సెంటిమెంట్ అని ఈసడించుకునేవాళ్ళు కవిత్వంలో పోకడలు నిర్దేశిస్తున్న ఈరోజుల్లో, మానవ రక్తాన్ని, స్వేదాన్ని మకుటాలు చేసుకుని మస్తకాలమీద అలంకరించుకుంటున్న ఈరోజుల్లో, మోసమూ, చౌర్యమూ, ద్వేషమూ, అసూయ, అజ్ఞానమూ, కవిత్వం,

x

వేరుతో కలరావ్యాధిలా వ్యాపిస్తున్న ఈరోజుల్లో, కవిత్వం వేరుచెప్పి కాయలమ్ముకుంటున్న వెధవలకి గండపెండేరాలు తొడుగుతున్న ఈరోజుల్లో, ఆ గండపెండేరాలు తయారుచేసే బ్రతుకుదెరువు పండితులూ, వాటి వ్యాపారంకోసం తెరిచిన దుకాణాలూ ముమ్మరంగాడున్న ఈ పాడు రోజుల్లో —

ఆకాశాలు తగిలే శిఖరాలు, విమలవాయువులు విహరించే ఆకాశాలు, పూలభాషలు మాట్లాడే అమాయక వాయువులు, కిరాతులమీద, జ్వలించే రంగులు ఉమిసే పువ్వులు, మానవతతో దోబూచులాడే రంగులు, కాంతి కమనీయత మనిషిమనిషికి సహనంగా పంచిపెట్టాలని ఆకోర్శించే మానవత — ఇవన్నీ ఎవరిమనసులో వెన్నెల తిరునాళ్ళ చేసుకుంటున్నాయో, వాడు చచ్చిపోవడమే మేలు. నేను చచ్చిపోవడం మంచిదే అయింది. చచ్చిపోతే ఈ నీచుల తమషా చూస్తూ ఉండవచ్చు—నాకేంకావాలి ; నా కవితని పూలూ పక్షులూ గానం చేస్తున్నాయి, గాలులూ ఆకాశాలూ దూరతీరాలకు మోసుకుపోతున్నాయి, వర్షాతాలూ అరణ్యాలూ ప్రతిధ్వనిస్తున్నాయి, నదులూ సముద్రాలూ ఘోషిస్తున్నాయి, సంధ్యలు ప్రతిఫలిస్తున్నాయి, ధ్వనులు జనులు జీవితాలతో మేళవిస్తున్నారు. కనక కాగితానికీ కలానికి గుడ్ బై—

చచ్చిపోయినవాడికి, బ్రతికిఉన్నవాడికి కనివించనివికూడా కనిపిస్తాయి. శబ్దాలు కనిపిస్తాయి-శతాబ్దాలు కనిపిస్తాయి-వినివించే సంగీతాలు కనిపిస్తాయ్-కనివించే రంగులు వినిపిస్తాయ్-కళ్ళపని చెవులు, చెవులపని కళ్ళు. కాళ్ళపని చేతులు, చేతులపని కాళ్ళు ఇలా శరీరంలో ఒకదానివని మరొకటి చేస్తే చావు సారాంశం బ్రతుకులో తెలుసుకోవచ్చు; బ్రతుకు సారాంశం చావులో ఇంకా బాగా తెలుసుకోవచ్చు. ఇదీ ఇప్పుడు నేననుభవిస్తున్న అసూయాజనకమైన అవస్థ.

ష్టాంకోక్తో ఈ అవస్థనే నల్లమందు ధూమపానంతో సిద్ధింపజేసుకోవాలనుకున్నాడు. ఆయన అంటాడు "అయిదుగుక్కలు పీలిస్తే చాలు, మనసులో భావం తలకిందులౌతుంది. ఒక నల్లటి ఈతగాడిలా హ్రస్వరూపం ధరించి, చైనీయులనిరాలా ఉత్కృష్టవాంఛలు రేపుతూ దేహంలోని సరోవరజలాలంతటా మందమందంగా వ్యాపిస్తుంది," "నల్లమందు అమూర్తమయిన వస్తువులకు మూర్తినిస్తుంది. ఊహను పదార్థంగామార్చి పరిణామం సంతరిస్తుంది." "మనకు

కనిపించనివాటికి మనం కనిపించేలా చేస్తుంది. మనల్ని భూతాలనుచేసి మనకు కనిపించకుండా తిరిగే భూతాలకు భయంకలిగిస్తుంది. ఆ పొగ పీల్చిన తర్వాత దేహం ఆలోచిస్తుంది (మెదడుకాదు) దేహం కలలుకంటుంది, మృదుల మవుతుంది, శకలాలవుతుంది, ఎగురుతుంది ; ఎగిరిపోయి తననితానే ఆకాశం నించి పక్షిలా చూచుకుంటుంది.''

ఏప్రిల్ మాసం వచ్చింది. తోటలో వనజ్వాల ఎర్రగా విరగబూచింది. (Forest flame) అప్పుడేవచ్చిన శ్రీ శ్రీ ఉత్తరం చదువుతున్నాను. నవుకరు కాఫీతెచ్చాడు. నాకూ, ప్రక్కనే ఏదో చదువుకుంటున్న రేంబోకూ, ఇచ్చాడు. నేను కొంచెం చప్పరించి "ఏమిటి పవుడర్‌పాలు వేశావా'' అన్నాను.

"అవునండీ, 10 గంటల్లోపుగా హైదరాబాదులో గేదెలుకూడా నిదర్శి లేవ్వు'' అన్నాడు నవ్వుతూ.

రేంబో నవ్వి "శ్రీశ్రీ ఏం రాశాడు.''

ఒకలైను (వినిపించాను) — "మీ కవితలో మీరొక పరుసవేది కోసం వెతుకులాడుతున్న అన్వేషిగా కనిపిస్తారు నాకు...''

"మీ శ్రీశ్రీగారికి ఆల్కెమీ తెలుసా ఏమిటి'' అన్నాడు రేంబో.

"ఏమో''

"నేను బెల్జియం, స్కాండినేవియా, ఇటలీ, ఈజిప్టస్, అబిసీనియా ఇలా దేశదేశాలు తిరిగాను, మీరు స్వర్ణవిద్య అనే ఆల్కెమికోసం.''

"వేమన పద్యాల్లోలా మీ పద్యాల్లోకూడా అందుకేనేమో కొన్నిశబ్దాలు, భావాలు అర్థంకావు,'' అన్నాను. రేంబో చిరునవ్వు నవ్వి "ఏ పద్యం గురించి అంటున్నారు.'' ఎన్‌పాన్సేనా మీ మనస్సులో ఉందిగా'' అన్నాడు. "ఔను మరి "సోనెట్ దె వోయెల్స్‌లో''కూడా అలాగే అర్థంకానివి ఉన్నాయి'' అన్నాను. "అది తంత్రాలకు సంబంధించిన వ్యవహారం ; ప్రతిరంగుకూ ఒక శబ్దంఉంది. ప్రతిశబ్దానికీ ఒక నిర్దిష్టమైన రంగుఉంది''. "నిజంగా!''. "ఔను నాకలా కని విస్తాయి, వినిపిస్తాయి'' అన్నాడు రేంబో గంభీరంగా. నేను కాఫీ తాగుతున్న వాడ్ని నిలువునా నిర్విణ్ణుడ్నయి పోయాను. ఒక నిముషం ఊరుకుంది.

వేమన్నను కలుద్దామా అన్నాను. రేంబో "నిజంగా నాకు చాలా యిష్టం" అన్నాడు. "ఎక్కడ ఆయన ఆశ్రమం?" "ఎక్కడని చెప్పేది. అదొక విచిత్ర మైన మనస్సు. అన్ని చెట్లు, అన్ని ఆడపులు, అన్ని ఊళ్ళు అన్నీ ఆయన ఆశ్ర మాలే." 'మరిఎక్కడకని వెళ్ళాలి మనం.' "ఏమో-అలా వెదుకుతూండటమే. మీరు సిద్ధమయితే ఈ సాహసయాత్ర సాగిద్దాం." సరేఅని ఇద్దరం కాఫీలు ముగించాం. ప్రవేశించాం విశాల విశ్వంలోకి; ఊళ్ళూ, అడవులూ, పొలాలూ, నదులూ, నగ రాలూ గడుస్తూ నడుస్తూ వెళ్ళగా వెళ్ళగా ఒకఊళ్లో ఒకవీధిలో ఒక చెట్టుకింద ఒకకాలుజాపి, ఒకకాలు మడిచి, మడిచిన కాలిమీద గడ్డంవెట్టి, దృష్టి నేల మీద నిలిపి, కూర్చోఉన్న ఒకాయన అల్లంతదూరాన కినిపించాడు. రేంబోకు చెప్పాను, ఈయనే వేమన అని. సమీపించాం - గోచీతప్ప ఏమీలేదు ఒంటి మీద. మేము దగ్గర ఉన్నా ఆయన ఎలా కూర్చొనున్నాడో అలాగే ఉన్నాడు. కదలలేదు, మెదలలేదు, మావంక చూడలేదు. ఒక చిరునవ్వు మాత్రం ఆ వంగిన మొహంలో కనిపించి పోయింది. ఏదో చిన్న కర్రపుల్లతో నేలమీద రాస్తున్నాడు. రేంబో అన్నాడు "మీకు పరునవేది సిద్ధించిందా?"-వేమన అలాగే ఉన్నాడు. మాట్లాడలేదు. రాస్తూఉన్న పుల్ల ఆవతల పారేసి నేలమీదరాసిన దానిమీద చెయ్యి వెల్లకిలా వేశాడు. అంతా అలాగే పూర్వంలా కూర్చున్నాడు. ఆ నేలమీదరాసింది చదివాము. 'హిరణ్యవర్ణాం హరిణీం సువర్ణ రజత స్రజాం' అంటూ వ్రాసిన అక్షరాలు కనిపించాయి. "మనం అడగబోయేది ముందే వ్రాశాడు. ఎలాగ్రహించాడు మన మనస్సులోఉన్నది." అని రేంబో ఆశ్చ ర్యంగా అడిగాడు. "నీ ఊహ భూతభవిష్యద్వర్తమానాల్లో ఉంటుంది. నీవివ్వుడు ఊహించి ఇవ్వుడే ఊహించా ననుకోవడం అజ్ఞానం. ఊహ అమూ ర్తము. అమూర్తవస్తువు కొందరికి కనిపిస్తుంది." అన్నాను నేను నాకా విష యాలేమిటో తెలియకుండానే. అంటే మరొక రెవరో నా శరీరాన్ని ఉపయో గించుకుని నా నాలుకతో మాట్లాడుతున్నట్లు. మేము వెనక్కి-తిరిగి వచ్చేశాం. "నాకు స్వర్ణంకాదు కావలసింది, స్వర్ణంకంటే విలువైన శక్తి, పువ్వుల భాషలు, నక్షత్రాల పాటలు వినగలగాలి. సంధ్యాకాశంతో సంభాషించాలి, నీలాకాశంక్రింద తుకతుకలాడే సముద్రపుగుండె చూడాలి, శతాబ్దాల గుండెలనించి దూసుకుపోయే మానవతావేగాన్ని త్రికాలాల్లో దర్శిం చాలి, శబ్దాలు చూడాలి, రంగులు వినాలి. దేశ కాలాతీతమైన అనంతాన్ని

భ్రూమధ్యరేఖలో ధరించాలి. అంటే ద్రష్ట కావాలి" అన్నాను. - "అవును నేనూ దాని కోసమే అన్వేషిస్తున్నాను; మళ్ళీ వెడదామా"... "ఇప్పుడెక్కడుంటాడో... దొరుకుతాడో దొరకడో"—

సూర్యుడు ఉదయించాడు, కాలదూరాలతో వలలల్లి జగజ్జనులమీద విసిరివేస్తున్నాడు. మళ్ళీ తోట—వనజ్వాల—కాఫీ—రేంబో—ఇవాళ శేషేన్ అంతర్ముఖుడై ఉన్నాడు. చూపులుమాత్రం విరగబూచిన వనజ్వాల పూల మీద పరుగులిడుతున్నాయి. "ఏమిటా మౌనముద్ర", అన్నాడు రేంబో. అంతే— శేషేన్ ఏదోఒక గ్రీక్ ఆరెకిల్‌లా మాట్లాడ సాగాడు. "కవి అన్నవాడు ద్రష్టకావాలి. ఎలాఅవుతాడు. అన్నిపాపాలూ చెయ్యాలి, అన్నివిషాలూ త్రాగాలి, ఇంద్రియాలను అస్తవ్యస్తం చెయ్యాలి; ఎంతో మనోబలం కావాలి, తనమీద తానే ఇంతహింస విధించుకోవాలంటే, అప్పుడు వాడొక ఘోరమైన నేరస్థుడౌతాడు; కిరాతుడౌతాడు, ఋషి అవుతాడు. ఎందుచేతనంటే వాడు అవ్యక్తాన్ని చేరాడు. సామాన్యమానవులు సుఖలాలసులై, ఉన్నచోటనే ఉండి పోగా పీడుమాత్రం బాధాగ్నుల్లోదూకి ఒక నూతన సువర్ణంగా బయటికివచ్చాడు. నాకు సువర్ణం దొరకడం చాలదు, నేనే సువర్ణం కావాలి" (రేంబో సన్నివహించాడు.)

వనజ్వాలనించి ఒక పువ్వు రాలింది. దాంట్లోనించి దిగి భోజుడు వచ్చాడు. మేము అభ్యుత్థానంచేసి ఆయన్ని కూర్చోబెట్టాము. ఆయన అన్నాడు. "ఇలా పువ్వుమీద ఎక్కి వెడుతూ మీ సంభాషణ వినివచ్చాను. విన్నారా: వాల్మీకి మొదట ఎన్నోపాపాలుచేశాడు, బాధలు అనుభవించాడు, కిరాతుడయ్యాడు, అవ్యక్తాన్ని వ్యక్తం చేసుకున్నాడు, అనుభవంతో ఒక అందని బిందువు నందుకున్నాడు. అక్కడ ఆయన కిరాతకుడూ కిరాతుడ్ని శపించేవాడూ, వేటగాడూ వేటాడబడేవాడూ.

ఇత్థంవిలప్య వివిధే దయితాం విచిన్వన్
రామో న తత్ర ధృతిమాన్ న హి లక్ష్మణశ్చ
తాదృగ్విధామవి కథాం కథయన్ స్వవాచా
వల్మీకజన్మమునిరేవ కఠోర చేతాః.

రేంబో ఇంకా చాలా ఆలోచనా పూరితుడయ్యాడు. "బోడెలేర్ మహాకవి ప్రథమద్రష్ట, రాజులకురాజు, నిజమైన దేవుడు," అన్నాడు, నేనన్నాను, "రేంబో అటుచూడు, ఆ సూర్యోదయం; అదే సూర్యాస్తమయం అవుతుంది, మరోతీరానికి.

ఈ తీరాలు, ఈ సంధ్యలు, ఇంద్రియాల ఇంద్రజాలం. ఈ ఇంద్రజాలం వల నుంచి తప్పించుకున్నవాడికి వాల్మీకే బోదిలేర్, బోదిలేరే వాల్మీకి. ద్రష్ట ఒక్కడే, త్రికాలా బాధ్యుడు"

నేను లేచాను; రేంబో భుజంమీద సాయంగా చేయివేసి ముందుకు నడుస్తున్నాను. ఏదోభారం నన్ను ముంచుకువస్తూ ఉంది. నా లాల్చీ అంతా చెమటతో తడిసిపోయింది. బుజంమీద శాలువా జారిపోయింది. అలా వెడుతూఉన్నాను వనజ్వాలవైపు. రేంబోకు అర్థంకాక అలాగే నిర్విణ్ణుడై నిలబడిపోయాడు. వెనక గుంపులు గుంపులుగా వస్తున్నారు భవభూతి, కోక్తో, లియోనార్డో, మైకలేంజేలో, బోదెలైర్, మల్లార్మే, కాళిదాసు, ఇలియట్, పౌండ్, జాక్ష్ కాంటాయానా, బాసుడు, గాలిబ్, జక్కన, సౌదా, మీర్, శ్రీనాథుడు, లోర్కా, ఇక్బల్, రోడే, రిల్కే, వర్జిల్, పికాసో, సోక్రటీస్, జీసస్, కవబాటా, కవఫీ, నెఫరీస్ ఎవరెవరో అలలు అలలుగా తలలు తలలుగా పరంపరలుగా రేఖలుగా కాంతులు ముసురుకున్నట్లుగా గుంపులుగా గుంపులుగా వస్తున్నారు.

నేను ముందున్న వనజ్వాలవైపు వెళ్ళుతున్నాను, వెళ్ళుతున్నాను, వెళుతున్నాను వనజ్వాల నన్ను అడ్డగించలేదు; అందులోకే వెళ్ళిపోయాను. నన్ను తనలోకి తీసుకుంది. నేను లేను. వనజ్వాలఉంది. వెనక వస్తున్న గుంపులు ఆ తలల పరంపరలు నా వెనకాలే వనజ్వాలవైపు క్రమక్రమంగా వచ్చి పువ్వు పువ్వులోనూ లీనమై పోయారు. మిగిలింది ఎర్రగా విరగబూచిన వనజ్వాల - ఎప్పటిలాగే ఏప్రిల్ హసము - మిలియన్ల పూలు గొంతులువిచ్చి కాకలీకంఠాలతో పాడుతున్నాయి.

"రండి, మా గుమ్మానికి తోరణాలుకండి
మానవ జీవితాన్నొక మహోత్సవం చేయండి"
"విడికెడు వసంతాలు అందరికీ బిక్ష వెట్టమంటావు
నీకుమాత్రం ప్రేమించే రెండు వెదపులు చాలునంటావు"
"పొండి
రేపటి గులాబీల తోటల్లో
ఉషస్సులై పొండి.
ఉషస్సులై పొండి".

గుంటూరు శేషేంద్రశర్మ.

(ఇందులో కవులు, రచయితలు, చిత్రకారులుచేసిన సంభాషణలు, వారి గ్రంథాల్లోవి.)

(శేషజ్యోత్స్న ఉర్దూ అనువాదాన్ని ఉర్దూ కవితా ప్రపంచానికి పరిచయంచేస్తూ ప్రఖ్యాత ఉర్దూ విమర్శకుడు, కవి, పూర్వం బ్రిట్జ్ ఉర్దూ విభాగానికి సంపాదకుడు, ఆయిన శ్రీ అఖ్తర్‌హసన్ వ్రాసిన పరిచయ వాక్యాలు.)

శేషేంద్ర శర్మగారు ఈనాటి ఆధునిక సాహిత్య వ్రపంచంలో అగ్ర గణ్యుడైన కవిగా, సమర్థుడైన విమర్శకుడుగా, పండితుడుగా సుపరిచితులు. జ్ఞానపీఠ బహుమతి గ్రహీత శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు ఈ కవిని గురించి "ఈ కవియొక్క రచన పరమోత్తమజాతికి చెందియున్నది ... ఇట్టి రచన చేయగలవారీనాడు వట్టుమని పదిమందియైననులేరు..." అన్నారు. తెలుగు కవితాలోకంలో నవయుగం నిర్మించినవారు, తన కీర్తి భారతదేశం దాటి ప్రపంచ సాహిత్యలోకాల్లో వ్యాపించినవారు మహా కవి శ్రీశ్రీ, శర్మగారి కవితని ప్రపంచ మద్యం అనీ కవితా ప్రపంచంలో మరెక్కడా కనివించని ఆశ్చర్యకరమైన శబ్దచిత్రాలు ఆయన కవితలో కనివిస్తాయనీ ప్రశంసించారు. సంస్కృతాంధ్రాల్లో సుప్రసిద్ధకవులు శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు వీరి శవనలో "ఎక్కడ బట్టినా మనోహర ధీరగంభీరశైలి కనివిస్తుంది. రీతిని ఇంతగా సాధించినవారు అరుదు..." అని వేర్కొన్నారు.

శేషేంద్రశర్మ మేధావి, జ్ఞానశీలి, విద్వాంసుడు అయిన రచయిత. కవితా శిల్పశాస్త్రంలోనూ, ప్రపంచ సాహిత్యాల్లోనూ, లలితకళల్లోనూ లోతు పాతులు తెలిసిన సుశిక్షితుడు, పరిణతుడు. అనేక సంవత్సరాలనుంచీ కవితలో సాహితిలో వివేచనలో చాలా కృషిచేసిన కలం ఆయనది. గద్య, పద్య రచన లెన్నో ప్రకటించారు. కొన్ని అందమైన అనువాదాలుకూడా చేశారు. కాళిదాసు మేఘదూతాన్ని ఇంగ్లీషులోకి, పర్షియన్‌కవి ఫిర్దోసీ రచించిన సోరాబురుస్తుముల గాధను, ప్రెంచి మహాకవి చార్ల్స్ బోదెలైర్ కవితను, తెలుగులోకి తర్జుమా చేశారు. ఇంగ్లీషు కవితలో శిఖరస్థాయినందుకున్న విఖ్యాత కవయిత్రి విరి సతీమణి రాజకుమారి ఇందిరాధన్‌రాజ్‌గిర్, శర్మగారు రచించిన "ఋత మోష" కవితా సౌందర్యానికి ఇంగ్లీషు దుస్తులు సుస్తరించారు.

శేషేంద్రశర్మ గారికి అనేక భాషలు తెలుసు. ఇంగ్లీషులో వారికున్న వైదుష్యం అప్పుడప్పుడు అ భాషలో వారుచేస్తున్న రచనలు నిదర్శిస్తాయి. (శేషజ్యోత్స్నలో కొన్ని ఇంగ్లీషు తర్జుమాలు వారే చేశారు.) గత కొద్ది సంవత్స

ర్లో ఉర్దూ భాషతోకూడా వారికి సన్నిహిత సంబంధ బాంధవ్యాలు ఏర్ప డ్డాయి. ఈనాడు వారు సులువుగా ఉర్దూ కవితా మాధుర్యం ఆస్వాదించగలరు. ఉర్దూ సాహిత్యం దాని పురోగతీ తెలీనివారుకారు. కానీ ఉర్దూలోకానికి పీరి కవితతో ఎక్కువ పరిచయంలేదు.

ఉర్దూ, తెలుగు సంబంధాలకథ చాలా పాతకథ. కానీ ఈ రెండు అందమైన భాషలమధ్య ఎంత సాన్నిహిత్యంఉన్నా కవితా సాహిత్యాల్లో పర స్పర సాన్నిహిత్యం తక్కువగా ఉండడం ఆశ్చర్యకరం. ఈనాడు ఈ నూతన భారతీయ సాహిత్య సాంస్కృతిక సమ్మేళనా వ్యాయాణం ప్రారంభం కావడం శుభోదర్కమని నిస్సందేహంగా చెప్పవచ్చును. పూర్వం జరిగిన పొరపాటు ఇప్పుడైనా దిద్దుకోబడుతూఉన్నందుకు సంతోషం. ఈనాడు అన్ని భారతీయభాషల్లోని విజ్ఞానులు జిజ్ఞాసువులూ వివిధ భాషల సంస్కృతుల ఆచార సాంప్రదాయాలు పరస్పర విదితంకాకపోయినట్లయితే ఈ విశాల భార తీయ చరిత్ర సంస్కృతులు ఎప్పటికీ సంకుచితంగా తృష్ణావీడితంగా ఉండి పోతాయనీ, అందుచేత చారిత్రిక సాంస్కృతిక అన్యోన్యత మన ఆధునిక కర్తవ్యం అనీ అర్థంచేసుకొన్నారు. అందుచేతనే ఈనాడు దానికోసం అనేక-చర్యలు తీసుకొంటున్నారు.

ఈ ఐక్యతను సాధించడానికి చేసే చర్యా మర్యాదల గొలుసులో సీలంకేవంశ్ (శేషజ్యోత్స్న ఉర్దూ నామధేయం) అనే శేషేంద్రశర్మ కవితా సంపుటి ఒక ప్రధానమైనలంకె. ఈ సంపుటిలో వారి 20 పద్యాలు ఇంగ్లీషు ఉర్దూ, హిందీ అనువాదాల సమేతంగా సమర్పింపబడుతున్నాయి. వారి భార్య ఇందిరా ధన్‌రాజ్‌గిర్‌గారు ఇంగ్లీషు అనువాదాన్ని, ఉర్దూ కవి డా॥ గ్యాజ్‌సిద్దికి ఉర్దూ అనువాదాన్ని సమర్థవంతంగా నిర్వహించారు అనువాదమే కష్టము, అందులోను కవితకు అనువాదం మరింతకష్టం, మరి అందులో తన ముందున్న తెలుగు, ఇంగ్లీషు అంతస్తులు రెంటికీ ఏమా త్రమూ తీసిపోకుండా అనువదించడం ఇంకా కష్టం; ఈ ప్రక్రియకు అద్భుత భాషానైపుణ్యము, విశేషభావనా కౌశల్యము, అవసరం. డా॥ సిద్దికి ఈ సుకుమార శిల్పాన్ని ఆతి నాజూకుగా నిర్వహించాడని చెప్పడానికి ఏ సందేహమూలేదు.

నీలంకే వంశ్ చదివితే వెంటనే వచ్చేభావం, ఇది సౌందర్య, అభ్యుదయ, నత్యాలు మిళితమైన కవిత అని. జీవితపు ఉత్తమ విలువలు శ్రీ శర్మగారి కవితా గగనరేఖకు విశాలతను నంతరించాయి. వారి కవిత భూమ్యాకాశాల మధ్యఉన్న రోదసినంతా ఎంతగా తనలో ఆకలించుకుందంటే ప్రపంచ కవితా మధుసింధువు నంతా తనలో నింపుకున్న ఒక పాత్రికలా ఉంటుంది. వారి ఊహలో సౌందర్యం, వారి మాటలో ఇంద్రజాలం మనమదిలో అందమూ ఆనందమూ నింపి అనుక్షణమూ తనవైపు ఆకర్షించు కుంటుంది వారి కవిత. నీలంకే పంశ్ చదువుతుంటే జీవితంలో కోణకోణాలకు, ఆశాపథాల్లో దూర దూరాలకు కాంతులు వెదజల్లినట్లు అనిపిస్తుంది.

శేషేంద్రశర్మ, నృజనాశిల్పంలో పరిహతమైన మార్గాలు మున్నంగా తెలి నినవాడని తన కవితలో కనిపిస్తాడు; మరొకవైపు వర్తమానకాల చేలాం చలాన్ని విడిచిపెట్టడు. శర్మగారి కవిత ఒక అందాలమేడ, ఒక అద్దాలమేడ; క్షణక్షణమూ పరిణామం పొందే వర్తమానరేఖలు, రేపటి స్వప్నాలుగా రూపు లెత్తుతూ వర్తిదింబాలు వర్నరిస్తాయి, గత కాల సౌందర్య విలాసాలు కూడా గోచరిస్తాయి అందులో. తన మేధారక్తవుచారలు ఆయన కవితకి రంగురూపు లిస్తాయి. ఆయన నంఘపు మూఢ విశ్వాసాలమీద చేసే తిరుగుబాటులో ఉద యించే విప్లవ జ్వాలలు కవితలో ఉష్ణోగ్రతను ఉదగ్రతను పెంచుతాయి. జీవి తంతో తగాదాలేదు. కానీ ఆయన జీనితాన్ని యథాతథంగా స్వీకరించడానికి కూడా సిద్ధంగాలేదు. ప్రతి పరిణత కవిలాగే ఆయన జీవితాన్ని వ్యాఖ్యానం చేస్తాడు; ఒక నూతన జీవన పరిపంచానికి విత్యస్థానం వహిస్తాడు.

ఆయనలో ద్యోతకమయ్యే అగాథ మానవ చరితా స్పృహ ఆయన నత్య ఉద్ఘోషలో చూపించే ద్రఢిమ ఆయన కంఠానికి ఒక గాంభీర్యాన్ని ఆయన మాటకు ఒక లోతును ఇచ్చాయి. ఆయన అన్వేషణకు ఆయన వ్యక్తీకరణకు అవధుల్లేవు. ఆయన కవితకు ఆయన అంతరాత్మే మూలం; గాలిబ్ అన్నట్లు "అది అంతరాత్మకు బదులు ఆంతర పరిపంచం". ఆయన గుండెమీద ఉన్న గులాబీ రక్తిమ నృష్టిలోని రంగులన్నీ లీనం చేసుకుంది. ఆయన కవిత ప్రతి అణువులోను రహస్యంగా దాగి ఉన్న ఒక తోటను తిల

కిస్తుంది, ప్రతి బిందువులోనూ గర్జించే ఒక సముద్రాన్ని గుర్తిస్తుంది; సృష్టిని తన సృష్టిలో ఒక భాగం చేసుకుని సుందర కవితా శిల్పమూర్తుల చిత్రిస్తుంది; శబ్దాలకు రంగులు పులిమి చిత్రాలు గీస్తుంది.

"వో ఆంఖే...తండీ మహెక్ పాతాహు..."

శర్మగారి కవితలోని అందమైన చూపులు మహాప్రవంచ భావనలుగా మారుతాయి, కవిత అంతటా వెల్లివిరుస్తాయి.

"దయారే రోమ్‌మే తుంకోదేఖా...గులాబోకో మరాకర్ లాయీహో"

గడిచే క్షణాల గులాబులు వాటి కోర్కెలు, కవి మనస్సులో, ఇవాళటి రేపటి కాలపు గాలివానల్ని పిస్తాయి; తన అంతర్గత విఫల చేతనని మేల్కొలుపుతాయి.

"హంగామే షబ్...ఖిరామా హై..."

ఈ తెలుగు లోకపు సౌందర్యోపాసకుడు ప్రణయ సౌందర్యాల రంగులు వెదజల్లినా, జీవన వేదనాగాయాల్ని అలంకరించినా కాలంలో జారిపోతున్న క్షణాల్ని పట్టుకోబోయి విశ్లథమనస్కుడైనా, ఆయన కంఠాన్ని కవితాశబలత విడిచి పెట్టదు, ఆయన స్వరం గాంభీర్యాన్ని కోల్పోదు. ఈ విశిష్ట లక్షణమే ఆయన కవితలో ఒక ప్రత్యేకతను ఉత్పన్నం చేస్తుంది, ఒక ఇంద్రజాలాన్ని రేకెత్తిస్తుంది.

శర్మగారి సూక్ష్మభావన ఎంతవేడిగా ఉంటుందో, భాషావకుంఠన అంత ఆకర్షణీయంగా ఉంటుంది; తన కవితా జ్వాలకు హిమబిందువులతో అల్లిన నెల్లాలు కప్పినట్లుగా ఉంటుంది.

ఆయన తలపుల ప్రయాణంలో ఆయనతో కలిసి మనం కూడా ప్రయాణిస్తాము; ఆయన కలలు మనకలలు, ఆయన హృదయస్పందన మనహృదయస్పందన. ఆయన రాత్రిల కోర్కెలు, మన రాత్రిల కోర్కెలు, ఆయన విఫలత అశాంతి మన విఫలత అశాంతి; ఆయనకూ మనకూ మధ్య దూరాలు మాసిపోతాయి; అద్వైతం ఆవిర్భవిస్తుంది. అనుమానిస్తూ దూరదూరంగా చూస్తున్న వాడిలో ఆర్ద్రత కలిగించి తనవాడ్ని చేసుకునేదే నిజమైన కవిత.

శర్మగారు తనకవితలో ఆశలూ ఆదర్శాలు స్వప్నాలు కలిపిఅల్లిన వలు వలు వర్తమానం నించి అనంతం వరకు వ్యాపించిన కాలరేఖమీద ఆరవేస్తారు. ఆ ఆద్యంతాల ఐక్యతలోనే వారి కవిత నిర్వాణం పొందుతుంది. ఈ కవి జీవించిన అనుభవాలు అందరి అనుభవాల రూపం ధరించి ఆయన సృష్టిలో లోకం ఊపిరి పీల్చడం మొదలిడుతుంది.

శర్మగారి కవితా జిజ్ఞాస మానవ జీవితానికి పరిగతి గీతం పాడుతుంది, పరిత్యూషాన్ని విరియిస్తుంది; "నూతన తీరాలు" అనే పద్యంలో "అయే జానే బహార్...హం నాయే ఆదంకో ధూంధడక్ నే...ఝూటీ ఇన్సానోంకో సలీజ్ పర్ చడాదేగే". "మనిషి" అనే పద్యంలో "కిత్నే చీక్తే తుఫానో..." అంటూ ఆయన కంఠం నినదించడం వింటాం. ఆయన అత్యద్భుతమైన పద్యం "తరాల తరంగా"ల్లో ఒక మచ్చిక అవని సత్యం కవితగా రూపొంది కేకవేస్తుంది—
"నయీ నసల్ జిస్కో లియే హంనే సిర్ఫ్ ఆఁసూ జక్మ ఖూన్ ... సూరజ్ కాదరియా వొంకా ఖీఁచ్లాయెగీ..."

శేషేందర్ శర్మ కవితమానవతని విభజించే ఇనప తెరల్ని తెరించివేసి, "ఏసీమలు చేరిందంటే ఇన్సానియత్ కా సూరజ్ జహెన్కా ఐవానోమే... మొఅల్లఖ్ హై..." అంటుంది నీలంకే పంఖ్ చదివి ఉర్దూలోకం నూతన కాంతిరేఖలు చూస్తుందనీ, నంతోషిస్తుందనీ నా విశ్వాసం.

(శేషజ్యోత్స్న హిందీ అనువాదానికి ఔరంగాబాద్ కళాశాల
హిందీశాఖాధ్యక్షుడు శ్రీ డా॥ తెలంగ్ ఉపోద్ఘాతము)

భావస్ఫూర్తి - అభివ్యక్తి

'శేష జ్యోత్స్న' క్షణక్షణాల, వాదానువాదాల, కృతి - అనుకృతుల సమ్మేళనం. ఇందులోని కవితలు ప్రధానంగా తెలుగులో వ్రాయబడ్డవి. వాటిలో రసరమ్యంగా ప్రస్ఫుటించిన కవికంఠానికి ఇంగ్లీషు, ఉర్దూ, హిందీ భాషలు దివ్యులూ మస్తాబులూ మాత్రమే. 'శేష జ్యోత్స్న, వ్యక్తిగత అనుభూతుం, అనుభవాల సమృద్ధతతో నిబిడమై శీతలమై, శారదమైనది. దీనిలోని భావస్ఫూర్తి నవీన కళారీతులతో నడయాడుతూ, ముగ్ధమోహనంగా, ఆకర్షణీయంగా ఉంది. దీని సౌందర్య విధానం, దీని రంగుల సంకేతం చాక్షుషమైందే కాక, భాస్వరమైందికూడా. కవిశేషేంద్రుని మనోపరిధులు ఇక్కడ లిప్త-నిర్లిప్తమైన, సమ్మోహక-గంభీర రహస్యమయమైన జగత్తులో మునకలువేస్తున్న వ్యక్తిత్వం, అహంతనుండి బయలువడి, పరిస్ఫుట మవుతుంది. ఒకచోట కవి తన్మయత్వంలో మునిగిపోతాడు, మరొకచోట భగ్న మవుతున్న విశ్వాసాల కారణంగా తేలిపోతాడు. కాని గరిమామయమైన వారి ప్రతిష్ఠ అడుగడుగునా జాగరూకమై ఉంటుంది. కవి అభావాది. వారి ప్రతి ఆలోకనా-బిందువూ ఒక్కొక్క కవితకు శీర్షిక అయిపోతుంది. ఆ శీర్షిక తన నూతన అర్థ గాంభీర్యంతో కొత్త సందర్భాలను జోడించుకుంటుంది. ఈ దృక్కోణ వైశిష్ట్యం శేషేంద్రుని కవిత్వంలోని సౌందర్య భరితమైన నుతనపోకడ. శబ్దాలలో తన ఆంతరిక సంగీతాన్ని కట్టి పడవేయడానికి కపికంఠం వ్యాకులత చెందుతుంది. ఆవేగజనితాలైన స్పందనలు అనేక దశలలో తమ భావదశను కట్టిపడవేయడానికి ఆతురత చెందుతాయి. శబ్దాల అర్థవత్తాన్ని ఇక్కడే గద్యవివర్తం త్రిప్పివేస్తుంది. ఆ శబ్దాలను మళ్ళీ తన ధరాతలంపైకి తీసుకోవస్తుంది. కవికి గల ఈ విశిష్ట శైలి ఒక నూతన అభివ్యక్తివిధానం, గంభీర కళాదృష్టి యొక్క సృజనశీలత్వానికి తార్కాణం.

యుగ సందర్భాలతో, నూతన ప్రవృత్తులతో, నూతన ఆశయాలతో కవికి పరిపూర్ణంగా పరిచయముంది. ఆయన అభివ్యంజనకూడా అతి గరిమా

మయమైన శబ్దనమూహాలతో కూడిఉంది. షేక్ ముజీబుర్ రహమాన్‌కు అంకితం చేయబడిన 'సోనార్ బాంగ్లా' పట్ల కవి ఇలా అంటాడు.

"ఐ, నా దాన్
సున్ లే జరా
....."

జీవితంలో సమయావకాశం ఉంది, ఆ అవకాశంలో అనేకానేక ఆశయాలు ఉన్నాయి. అవి క్రొత్త ధరాతలాలపై అభివ్యక్తి చెందుతూఉంటాయి. సుఖదుఃఖాల భావపరిధిలో ఆంతరికమైన సత్యం తనంతటతానే సమన్వితమై పోతుంది ' ఈ అభివ్యక్తికరణమే జీవనదృష్టికి గల దృశ్యవిధానం.

"చలో అయ్ జానే ఆర్‌జూ
తూఫానీ బాధ్‌మేఁ జస్న్ లగాయేఁ
....."

జీవన 'క్షితిజం'లో మానవుడు, మానవీయ చైతన్యాన్ని దర్శింపచేసే అవలోకన బిందువు ఇది. ఈ చైతన్యం గతిశీలమైందే కాకుండా ఆ యా నందర్భాలలో నియతమూ, యుగసీమితమూ అయికూడా చమత్కార బంధురము. ఈ చమత్కారం జీవిత అంతర్మాల్యాలకచెందినది. దీని రంగసంకేతాలు అతిస్పష్టంగాను, భాస్వరంగాను కనిపిస్తాయి. ఈ చిత్రాలలో చిత్రాత్మక అభివ్యక్తి అతి రమణీయమైంది. ఒక అభివ్యక్తిని తిలకించండి.

"జైసే ఇన్సాన్
ఏక్ కినారే సే దూస్‌రే కినారే కే దర్మియాన్
....."

క్రొత్త నందర్భాల దృశ్యాలు స్థూలంగాను, సూక్ష్మంగాను రెండు రూపాల్లోకూడా చిత్రించబడ్డాయి.

"ఇష్క్ అగర్ జీవన్‌కి మిఠాస్ హై
తో ఆషిక్ ఏక్ పూర్ హై
....."

భూతం వర్తమానంలోను, వర్తమానం భవిష్యత్తులోను రూపాయిత మవుతున్నది. వ్యక్తిచైతన్యం సాంఘిక చైతన్యాన్ని నవాలుచేస్తూ ఇలా అంటున్నది.

"హమ్‌నే క్యా సర్‌మాయా ఛోడా హై
బజుజ్ అష్క్ ఓ ఖూన్ ఓ జంగ్
....."

పారిస్ నగరంలో డిమెలో విగ్రహాన్నిచూసి కవి ఆమెనేత్రాలను తన నేత్రాలతో ఏకీకృతం చేసుకొని, ఇలా అనుభూతి పొందుతాడు.

"వో ఆఁ ఖేఁ
నీల్‌గగన్ కే టూటేహుయే దో టుక్‌డే
....."

ఏ నత్యాలతో కవికి అనుభూతిపరమైన సంబద్ధత కలిగిందో, వాటి నంస్కారాలు కూడా తరశీకృతాలయ్యాయి, వాటి అభివృద్ధికూడా తరళం, తరళతరం అయింది.

"దేఖో,
మైనే ఇస్ పాకీజా లమ్హేనే
....."

కర్పూరగౌరవర్ణ శోభితుడైన శేషేంద్రుని వ్యక్తిత్వమూ, అస్తిత్వమూ, అనంత నీలాకాశంలో ఎగిరిపోయే రెండు పక్షులవంటివి. అవి ఆ 'క్షణం'లో కేంద్రీకృతా లయి, సీటిలో కమలంవలె వికసించగోరుతాయి, లేక మంచు ముత్యాలవలె చెదిరిపోతాయి, ఆశల హారతి నమయంలో, క్షణకాలం కర్పూరంలా వెలిగి సుగంధాన్ని వ్యాపింపజేయ గోరుతాయి. ఈ వంక్తులు ఎంత అందంగా ఉన్నాయో, చూడండి.

"జబ్ నైనోఁకె కమల్ తుమ్‌పర్ ఖిలే
తో సింద్ ధఁవరా బన్‌కర్ ఉడ్‌గయా
....."

వేదనా సంభారంతో కరుణాపతారుడు నమితుడైనాడు. వేదనామేఘాలు సాంద్రం, ఘనీభూతం అయి, ఎలా దిగివచ్చాయో కదా! వర్షంకూడా ఆగి పోయింది; కవి హృదయపు పలుకులు ములుకులవలె ఇంతే చెప్పగలిగాయి.

"ముఝే ఉమ్మీద్ నథీ
కె రూహ్ పెకుసర్వానాకే సాయే
....."

అవసాద భరితాలయిన ఈ క్షణాలు ఎంత మార్మికంగా ఉన్నాయి? మర్మభరితాలేగాదు, మర్మాన్ని స్పృశించేలా ఉన్నాయి. కాని ఏం ప్రపంచం?

"వక్త్ ఆగర్ దస్తక్ దే
తో అప్నీ ఆఁఖోఁకే ఘూంఘట్ ఖోలో
....."

ఈ ప్రపంచంలో సారమయమైనది ఏమిటి?

"ఆ బే రవాఁ మేఁ
హమ్ పూలోఁకి దో కష్తియాఁ పైఁ

కర్పూరగౌరమూ, కరుణావతారమూ, సంసారసారమూ అయిన దానితో పర్యాయంగా ఎంచుకుంటే, ఈ బాహువులు భుజగేంద్ర హార నమమైన బాహుపాశంలో బద్ధనిబద్ధ యుగనద్ధమైన శీతలజ్వాలకు ప్రతీకాలు, ఛాయా ఖాసాలు, పరితికిరణాన్ని స్పృశించి, ఆలోకవికీర్ణంచేసే సౌందర్యాలు.

"తుమ్హారీ బాహేఁ
ఖేతోఁ పర్ రక్స్ కర్తియాఁ చాందినీకి మానింద్
....."

శేషజ్యోత్స్న తిమిర–మిహిరాల వెలుగునీడల సమ్మేళనం. ఈ కావ్య సౌందర్యం దానినే అభివ్యక్తీకరిస్తున్నది. లోమ, అనులోమ, విలోమాలపై విన్యాసం కలిగిఉంటే, ఈ కావ్యసంకలనంలో లభించేవి సత్యం,శివం, సుందరం.

బాలచంద్రరావ్ తేలంగ్

[తెలుగు అనువాదం: ఉస్మానియా విశ్వవిద్యాలయ హిందీశాఖలో రీడరు డా॥ భీంసేన్ నిర్మల్.]

ఇందిరకు

ప్రేమతో

"ఒక్కరోజే కావచ్చు కానీ
అది చరిత్ర పెదవుల్ని చుంచిందె
రెండు కిరణాల్ని ముడివేసి
అక్షర జగత్తు
మెడలో వేసింది.....
నాకు తెలుసు ఈరోజు ఉభయ ప్రపంచాల
కవితా వేజీల్లో
నువర్ణాక్షరాల మాల వేయించుకుంటుందని."

("ఆరోజు" నుంచి)

పడవలు - తెరచాపలు

[రిపబ్లిక్ దినోత్సవ సందర్భంగా 25-1-72 సాయంకాలం ఢిల్లీలో ప్రసిద్ధ హిందీకవి దినకర్ అధ్యక్షత క్రింద జరిగిన ఆకాశవాణివారి జాతీయ కవి సమ్మేళనంలో చదువబడింది. పద్యం వంగబంధు శ్రీషేక్ ముజిబుర్ రహమాన్‌గారికి అంకితం చేయబడింది]

ఆకాశంనించి తెగి సూర్యుడు
నెత్తురు టేరుల్లో పడ్డాడు
పూలరంగులు ఫిరంగులు
ఢీ కొన్నాయి,
పక్షుల గొంతుల్లో పాటను పుచ్చుకొని
పారిపోయింది రాత్రి
కోటికళ్ళలో అగ్ని
అయిందొక బ్రహ్మాండ శతఘ్ని
నిశ్శబ్దంగా ఉన్న శతాబ్దాలు
నిగళాలు త్రెంచుకొని నిల్చున్నాయి
నిండుకంఠంతో వేసినకేక
కాలపు పొలిమేరల్ని కుదిపింది
జీవనకుహరంలో స్పందించే ధ్వని
బ్రద్దలై భూవలయం దద్దరిల్లింది

పిడికెడు మట్టికోసం కాదు
ఒక పుట్టుక కోసం
పొత్తిళ్ళలో పిడికిళ్ళు విచ్చే
ఒక చేతన కోసం
గాలికోసం కాంతికోసం
గగనంలో కెగిరే రెక్కలకోసం...
ఓ ధరిత్రీ! ఓ జననీ! నిశ
మ్రుచ్చిలించిన ఆ పాటను
మళ్ళీ పక్షుల గొంతుల్లో పెట్టు
ద్వేషం గూడు కట్టుకున్న గుండెల్లో
జీవనప్రేమ వెలిగించు
నీరు, గాలి, ఆకాశం, మనిషి
నిర్మలంగా ఉంచు
తన భవితవ్యాన్ని మహిళ
నుదుటి కుంకుమతో
యువకుల వేడి నెత్తుటితో
కొనడానికి సిద్ధపడిందానేల:
ధూమ్ర మేఘ పంక్తుల్లో
తేలుతూ పాటలకాంతులు పుక్కిలించే
ముఖాల గుంపులు
రత్నాల స్మృతులరెక్కలు
సంతరించుకుని
అనంత నీలిమ అందుకున్నాయి

జనతను బంధించే దెవరు
సముద్రాలకు ఝంఝూమరుత్తుకు
సంకెళ్ళు వేసే దెవరు
అరే! మూర్ఖుడా! చరిత్రలో
గాలులూ అడవులూ కొండలూ
విప్పే ఆ పురాతన బొంగురు గొంతుక
వినిపించడంలేదా!
చూడు
ఆశలు రక్తబిందువులు కలిపి
అల్లినదండ వేసుకుని
వస్తున్నాడు
కాళ్ళకు తగిలే ఖండాలను
ఖండాంతరాలను గగనంలో
కెగర దన్నేడు
సముద్రాల్లో సముదగ్రకెరటాలు రేపాడు
కొండలు దిండ్లుగా విశ్రమించాడు
ఉషస్సు మృదువుగా వాడి
ముఖంమీది చెమరు బిందువుల్ని
రక్తపు మరకల్ని తుడుస్తోంది
నిన్న గగనంలో గాయంగా ఉన్న
సూర్యుడు, ఇవాళ
మణులూ మాణిక్యాలూ వెదజల్లుతున్నాడు
నిన్న నెత్తుటి బురదలో

పిశాచాలు తాండవం చేసినచోట
ఇవాళ పచ్చటి గమిళ్ళలో
నెమిళ్ళు నృత్యంచేస్తున్నాయి
గంగ ఒడ్డున బ్రహ్మపుత్ర ఒడ్డున
ఆడుకునే పిలలు
కాలంలో పడవల తెరచాపలెత్తారు,
హిమాలయాలు
మందస్మిత శ్యంగాలతో తమ ఒడిలో
కాహ్వానిస్తున్నాయి వాళ్ళని
క్రొత్తసూర్యుడు క్రొత్త ఉదయాన్ని
సువర్ణ కిరణాలతో
స్నానం చేయిస్తున్నాడు.

ఆ రెండు కళ్ళు

[కవి దీని మాతృకను ఇంగ్లీషులో ప్రాసి తే. 16-6-1972 న
ఇందిరకు హలేబీడలో అంకితం చేశాడు.]

"ఇన్నాళ్ళెక్కడున్నావు నీవు" అన్నాయి
నా పెదవులు మృదువులైన అక్షరాలుగా మారిన
జన్మాంతర నిరీక్షా మధువుతో తడిసి—
కానీ ఈ జన్మలో ఇదే మొదటిసారి
నిన్ను చూచాను...
బహుజన్మల సమూహాలకు పూర్వం
నాలో నీవు నీలో నేనూ ఉన్నాను కాబోలు...
ఆ కనులు- నా సువర్ణ ఇంద్రనీలాల గనులు—
వాటిలో తిలకిస్తూ పులకిస్తూ పోతే
హిమాలయ శిఖరా లధిష్ఠించిన ఒక నగరం
తారల తీరాల కెగిరిపోయే ఒక పతంగం
కోటి కిరణాల అంతరంగం
ఆ లోతుల్లో చూచా నీ సత్యం—
ఏవో తెలియని రహస్యాల కొసలు మసలే
ఆ కన్నుల్లో దర్శించాను, ఎప్పుడో నిష్క్రమించిన
నా పరిమళాల ప్రపంచాన్ని—

అదృశ్యమైపోయిన నా బ్రతుకుల కోనల్లో కానల్లో
ఒయ్యారంగా, దారికోసం ఇటు అటు
సంచరిస్తున్న ఒక అవ్యక్త షహనాయీ స్వర ఝరి—
నీరవ చరణ విన్యాసాలతో వచ్చి ఉషస్సు
చుంబించే నిశ్చల వనభూములలోకి
చంద్రకిరణం నించి మెల్లగా జారి వచ్చిన
ఒక అప్సరసలాంటి హిందోళరాగ లహరి—
చెంగావి లేయెండలవంటి వలువలు దాల్చిన రాజమహిళలు
మన సర్వేంద్రియాల కోర్కెలు గూడు కట్టుకున్న,
వారి అల్లిన ఇరుల కురులలో చెరలాడే
కుసుమ తుందిల గంధిల నీలిమలు—
వారి మృదుమధుష్ల పెదవ్రలపై
అల్లిఓల్లిగా అలమిన చిరునవ్వులు—
కోటలలో తోటలలో మేడల నీడల
పట్టుల్లో కూర్చుని
చెలిక త్తెలు ఋతుగీతిక లాలపిస్తుంటే
కురంగి కన్నులు విప్పి చూస్తుంటే
రంగుల విహంగి పురివిప్పి నటిస్తుంటే
ఓ! ఏమి స్మృతులు! ఎన్నో మృతుల వెనుక
నిలిచి పిలిచే సుందరాకృతులు—
ఆ విదూర వింధ్యోత్తర భూములు—
రాజపుటానా ఎడారి ఇసుకలలో
మలుపులు తిరిగే అనంతమార్గాలు దుర్గాలు

ఆ గిరులు ఆ నగరులు ఆ ఝరులు ఆ తరువులు—
ఏ చిత్తరువులు మా నాన్న గ్రంథాలలో చూచానో
ఒంటరి బాలుణ్ణిగా మేడమెట్ల మూల
ఏకాంతంగా కూర్చొని చూచానో
నా అవ్యక్త మనఃకుహరాంతరాలలో వెతికానో
ఎప్పుడో పోగొట్టుకున్న ఏదో సౌందర్యం కోసం—
అది- ఆ సౌందర్యం!
ఇదిగో- దొరికిం దిప్పుడు ఈ కళ్లలో
దూరాన ఉదయించే ఆ ప్రాచీరేఖలో
పుట్టుక కోసం నిరీక్షిస్తూ
చిరునవ్వులు చిందే మోములతో కనిపించే
నా పుట్టని ప్రియశిశువుల జననీ జనకులు
అయిన ఈ రెండు కళ్లలో...

నూతన తీరాలు

[దీన్ని జనవరి మొదటి తారీఖున కవి మొదట ఇంగ్లీషులో వ్రాశాడు. దీనికి ఇది కవి తెలుగు అనువాదం.]

రోదసి మరింత గంభీరంగా మారింది
నన్ను ఒంటరిగా చిక్కించుకుని
రహస్యంగా
ఒక గర్జించే మాట చెప్పింది—
నీవు నమ్మితావా నెచ్చెలీ
ఈ రోజులింకా క్రైస్తుల క్రాసుల రోజులని,
నిజంగా నమ్మితావా?
కాలచక్రం తిరిగి తిరిగి
జీవితాన్ని క్రాసుగా మలిచిని క్రైస్తుగా
మలిచిన ఈ రోజు
ఒక నూతన యుగ సూర్యుడు ఉదయిస్తున్నాడు
మనకొక కానుకగా పట్టుకువస్తున్నాడు
ఒక నూతన గీతను
విప్లవాన్ని వీర మరణాన్ని ఉద్ఘోషించే
ఉచ్చైస్వర గీతను :
ఇవాళ ఈ సాహసోపేత నూతన యుగం
సంకెళ్ళు భేదించి మహాశక్తిగా మార్చిన

మనిషి

అమృతంకోసం ఆకాశలోకాల కెగిరిపోతున్నాడు :
అవని వీథులమీద పెట్టిన అడుగులు చాలక
అనంత వీథుల్ని ఆక్రమిస్తున్నాడు...
నేటి క్రైస్తు నిన్నటి క్రైస్తును కలుస్తున్నాడు
ఎలా
ఒక మహాగరుడుడుగా
పాడని పాటల పూలకొమ్మను ముక్కున
ధరించుకొని ఎగిరిపోయి
మనుష్య అవగాహన సీమల కావలితీరాలలో
కలుస్తాడు
క్రౌసుకు తన నూతన గాన రసరాసులతో
సువర్ణాభిషేకం చేస్తాడు,
నెచ్చెలీ పరుగెత్తే ఈ ప్రవాహంతో కలిసి
పరుగిడుదాం పద
రేపటి ప్రభాతాల జ్వాలల్ని
కలుసుకుందాం పద —
రోషద్వేషాల కూలంకష ఘోషలు
పచ్చటి కాల శాద్వలాల్లోకి ప్రవహిస్తున్నాయి
అక్కడ జీవిత దర్భ పల్లవాల్లో
మోసులెత్తిన మృదుల పుష్పాలం మనిద్దరం—
ఇనపరంగు ప్రత్యూషాలు
తుపాకి మందుగంధాలు
కండల్లో నిదురించే కదన కండూతిని

మేల్కొల్పుతున్నాయి
ఒక యుగపు నినాదాలూ సిద్ధాంతాలూ—
ఆ యుగపు చెత్తఅంతా—
చరిత్రతో కలసి వెళ్ళిపోయాయి,
అనుకోకుండా అవతరించిన ఉషస్సుకోసం
వంగే నింగినించి నిష్క్రమించే నక్షత్రాల్లా
ప్రాచీరేఖమీద ప్రాకే పర్వత శ్రేణుల్నించి
పారిపోయే ధూమ్ర పంక్తుల్లా—
ఆ చెత్తని కీర్తిస్తూఉన్న మనం మాత్రం
యుగాంతాన మిగిలిపోయాం వంచితులంగా,
వెళ్ళిపోతూ రేపిన ధూళిమబ్బుల్లో
దారిప్రక్కన దిగబడిపోయిన ప్రయాణీకుల్లా
వాలే సంధ్యను జాలిగాచూస్తూ
ఉదయించని ఉషస్సుల కోసం
ఉత్కంఠతో అర్రులు జాస్తూ—
ఓ మనిషీ! నీవు యుగశిశువు; కేవలం
కాలగర్భపు అర్భకుడివి
అజ్ఞాన మధురిమలో తేలే కిశోర శశివి
నిశలోనే శోభిస్తావు—
మతాలు అభిమతాలు విశ్వాసాలు
మొదలైన దుస్తులూ ముస్తాబులూ
విప్పివేస్తే
నీవు సరళమైన తరళమైన సరిత్ ప్రవాహానివి:

కోమల హస్తాలు నిశ్శబ్దాకాశాల
నిరవధికతలోకి ఆడిస్తూ
శ్యామల తృణసీమల్లో ప్రవహిస్తావు
హసించే పువ్వుల కోవల
నటించే నెమిళ్ళ క్రేవల
ఒక పేశల గీతికలా మహా
సముద్ర ఘోషతో ఐక్యంకోసం
ఆకాంక్షిస్తూ—
మనఃకులాయంలో గ్రద్దలు
చూపులు విదూర స్వప్నవలయాల్లో చిక్కుకుని
యెదలో జ్వలించే ఎగరలేని శిఖరాల వంక చూస్తూ
కాకలీ కంఠంతో విలపిస్తున్నాయి —
అగ్నిపర్వతాల గుండెలు
ఘుర్ఘురధ్వనులు చేస్తున్నాయి
ఉద్రేక భావలావాప్రవాహాల్లోపడి మానవుడు
నూతన తీరాలకు కొట్టుకు పోతున్నాడు
ప్రాక్ పశ్చిమాల మధ్య
వెలుగు చీకట్ల తీరాల మధ్య
ఇటూ అటూ కొట్టుకుపోతున్న
మండే సూర్యమండలంలా మానవుడు
తీరాన్నించి తీరానికి కొట్టుకుపోతున్నాడు
వన్నెల పరిణామానికి వంగిన కాలం
విశ్వాసాలను విజ్ఞాన సౌధాలను
విభ్రాంతులు చేస్తోంది—

అదిగో వినబడుతూ ఉంది మానవుడి
తడబడే అడుగుల చప్పుడు,
దేవాలయాల గోడలు పట్టుకుంటూ
రక్తధారలు కార్చుకుంటూ వస్తున్నాడు,
ఏ గోడల నీడల్లో కాళ్ళువిరిగిన దేవుడు
కన్నీటి మడుగుల్లో పడున్నాడో
ఆ గోడల మీద వాలుతూ
తూలుతూ వస్తున్నాడు—
తన నిస్సహాయతకు తనని తానే
కనికరించు కుంటూ
కాలపు ఇనపగుండు బుజానమోస్తూ
వస్తున్నాడు.
కానీ ! చూడు ! ఆ మనిషే
యుగాల సంధిలో నలిగి ఈ నాడు
చరిత్ర పురాతన గుహల్లోంచి
ప్రతిధ్వనించే పొలికేకలా
ఆకాశం మీదికి విరుచుకు పడుతున్నాడు
అసత్యాన్ని శిలువకు పంపిస్తున్నాడు ॥

నీవు

[వీనస్ డి మెలో అనే అందమైన రోమన్ ప్రేమదేవత శిలావిగ్రహాన్ని కవి పారిస్‌లో చూచి ఉత్తేజితుడయ్యాడు; తరువాత రోములో అక్టోబరు 1970లో ఈ పద్యం వ్రాశాడు]

మాట్లాడు - తరుణీ !
ఒక్క-సారి మాట్లాడు
అదృష్ట తీరాలనుంచి అవతరించి
నా నేత్రాంచలసీమల్లో శక్రధనువులా వెలసిన కలా!
గులాబీ మొగ్గల్లాంటి ఆ పెదవులు విప్పు—
నా అపరిపక్వ జన్మాంతర కెరటాల గమిలో
కాలకుహర శయ్యా సుషుప్తి గరిమలో
ఎన్నాళ్ళు నిదురించావో - వీనస్ డి మెలో!—
మెలో — అలో — క సౌందర్యరాశీ!
వృథాగా రాలిపోయేవి నా తోటలో రోజూ పూచే రోజాలు,
ఇన్నాళ్లు నీవు కనుపించావుగాదు
నీ చిగురుపాదాల మీద ఉంచుదామంటే—
రోములో ఏకాంత శిథిల శిలా ద్వారబంధంలో
కనుపించావు...
ఏ సౌధ శిలాద్వారమో ఏ శిల్పి
స్వప్న రేఖా సమున్మీలనమో.....

నీడలుగా జాడలుగా కనుపించే కొండ కోనల వెనక
చెట్లకొమ్మల వెనుక సంధ్యాకాల దీధితిగా కనుపించావు:
కాలపు గులాబీలు దోచుకొని, నెఱసంజ
కెంపుల ధూళి వెనుక విడిచి, పారిపోతున్నట్లు
కనుపించావు .....
ఆ రోమన్ అస్తమయం మైకేలేంజిలో
బ్రితుకు వెన్నెల వన్నెలలో ముంచిన
కిర్మీరిత తూలికలా ఉండెను—
నీ కన్నులు మిన్నులు విరిగిన నీలి శకలాలు,
రెండు విహంగాలుగా, రెక్కలు వచ్చిన
రెండు ఇంద్ర నీల మణులుగా అనంత
వీథుల్లోకి ఏగిరిపోయి ఉంటాయి—
భూగోళపు పడమటి అంచులు కురిసిన వెన్నెల మంచులు
నీలో దర్శిస్తున్నా ..... దోర్బలమూర్తులు దాల్చిన
శతాబ్దాల స్కంధాలపై లేస్తూ పడుతూ ఉన్న
నగరాల సామ్రాజ్యాల యశశ్శోభ
నీలో చూస్తూ ఉన్నా, చరిత్ర పేజీలు
నా గుండెల్లో రెపరెపలాడుతుండగా—
'నిన్ను చూచాను నన్ను మరచాను
ఒక తియ్యటి కల రాయంచలా
నా మధుర నిదురలోకి వచ్చింది ఓయ్యారంగా,
తేలియాడుతూ వచ్చింది తెలిమబ్బు తునకలా—
సంతోషపూరిత బెలూనులా
నే నాకాశపు నీలిబాహువుల్లోకి ఎగిరిపోయాను;

నా మనస్సుకు రెక్కలు వచ్చాయి—
ఏదన్నా చెప్పు, డి మెలో ఏదన్నా చెప్పు
ఈ పూల నిట్టూర్పులు ముసురుకున్న
నిశావేళ గడచిపోకముందే ఏదన్నా చెప్పు—
ఎన్ని రాత్రుల వెన్నెల లహరుల్లో జలకా లాడేవో
ఎన్ని గులాబీ సంధ్యల పరిమళాలు అనుభవించావో
ఎన్ని ప్రత్యూష సమీర తరుణాంకురాలు నీ కోమల
దాహవులు చుంబిస్తూ పరవశించాయో
చెప్పు, సౌందర్యరాశీ.
నీ అతిలోక మూర్తి పెదవుల మధువులపై
నా మానవ కళంక ముద్రలు వేయనా, వీనస్ డి మెలో
ఈ నిశ మనల్ని విడిచిపోక ముందే చెప్పు
కాలం తన గర్భంలోకి తీసుకున్న ఏ శిల్పి నీ కన్నుల్లో
ఇన్ని ప్రేమనగరాలు పొదిగాడో
ఆ కన్నులతో నగరాలు సాగరాలు
సమరాలు సామ్రాజ్యాలు నాగకరతలు
పెరుగుతూ విరుగుతూ ఉంటే చూస్తున్నావా?
ఉదయాస్తమయాల రెక్కలపై ఎగిరిపోతున్న
కాల విహంగాన్ని చిరునవ్వుతో చూస్తున్నావా—
ఏఏ పయనించిన బాటసారుల ఆశాంచల వీథుల్లో ఉషస్సులా
ప్రఫుల్ల మల్లికలా వికసించావో
ఎందరి జీవితాలను ప్రేమ జరీ పోగుల
అల్లికలతో అలంకరించావో
ఎందరి కన్నుల్లో రంగు రంగుల కలలు పులుగులకు

కోర్కెల పట్టుదారాలతో పేశల ఆశల గూళ్లు నిర్మించావో
అదంతా చెప్పు
క్షణాల ఒంపెల బిడారులు జీవిత ఎడారుల
అంచులు చేరక ముందే మాటాడు, సుందరీ!
నా తలపుల వనశాద్వల సీమల్లో
వలువలు తొలగించి శరీర మౌక్తిక ధవళకాంతులు
వెదజల్లుతూ నా వైపుకు నడుస్తున్నావా, సుందరీ
ఇటు రా—
నీవు శిలవు కాదు కలవు కాదు నా వలపుల వలలో చిక్కిన
శబలవర్ణ సంచాలిత శఫరివి, ఒక అనిర్వచనీయ క్షణంలో
నా కోటి నాడుల దారుల్లో
విరిసిన సౌందర్య రసానుభూతివి—
క్రూరమైన దైనిక జీవితం ముక్కలు చెక్కలు చేసిన వన్ను
కలిపి జీవం పోశావు
నిన్ను దర్శిస్తూ సర్వేంద్రియాలతో
స్పర్శిస్తూ పరవశించే వేళ
నా ఒడినిండా మధుర స్వప్నాలతో నింపావు.
నిన్ను గూర్చిన భావాలు హంసల జాలులా
పూలపడవల్లా
నా సర్వాంగ శోణిత
సరసీజలాల్లో సంచరిస్తున్నాయి.
ప్రేమొక మకరందమైతే నే నొక పుష్పాన్ని
నీ కోమల పాదాలతాగ్రాలు పూచిన పుష్పాన్ని—
నీ కౌగిలి ఒక వెన్నెల లోగిలి

ఓహో, ఏమి జరిగింది నీ కౌగిట్లో నాకు!
తొలి ఋషులు అగ్నికీలల్లో మంత్ర గ్రామాలు దర్శించినట్లు
నీ కౌగిట్లో ప్రేమజ్యోతిని చూచాను.
నేను నీ భౌతిక మూర్తికోసం రాలేదు:
వచ్చా నొక కిరణం కోసం ఒక కవితా చరణంకోసం
కిరణాల్లో స్నానం చేశాను
మృదు మధుర స్మరణల్లో గానం చేశాను
నన్ను నేను చేరుకున్నాను.

చీకటి దయ్యాలు

ఎవరు రానిస్తారు ఈరాత్రిని!
ఆ సిందూరసుందరి నెందుకు పోనిస్తారు...
రాత్రి అడుగులచప్పుడు వినిపిస్తే
చాలు
గుండె గుబగుబలాడుతుంది
సాయంత్రపు రక్తంత్రాగి
వికటాట్టహాసంచేసే ఆకాశపు నోటిలో
భీకర దంష్ట్రాపంక్తులు
సితశోణిత నక్షత్రాలు
ఉఫ్! దిశనించి దిశవరకు ఈశర్వరీ నేత్రాల్లో
ఎంతటి గాఢ తమస్సు!
ఇది ఒక పీడకలలగూడు
విహ్వల మనఃశకలాల్లో పుట్టిన
కుటిలాకృతులు తాండవించే బీడు—
చీకటి దుప్పటిలో ముఖందాచుకుని
భ్రాంతుల ఉడుపులు తీసి
కడుపులోకి కసుక్కున
ప్రశ్నతో పొడుచుకుంటాను
రక్తధార లెగజిమ్ముతాయి

రేపటిలలిత చేలాంచలాన్ని మలితం చేస్తాయి
లేనికళ్ళు వెడదలు చేసి
నిడుదలైన కంకాళాలేవో
శిథిలస్మృతి సౌధాల్లో
ఇటూఅటూ సంచరిస్తున్నాయి
ప్రసన్నకాలాన్ని కబళిస్తున్నాయి
మదిని విశ్లథంచేసే గొంతులతో
గాలిని కళ్మలం చేస్తున్నాయి—
ఆనందం
దృష్టస్రష్ట అయిన మనీషి పాణిశ్వాస
అది ఈయుగవు వికృతసత్యాల
కఠిన శిలాశిఖరాలమీద నిలువలేక
దూకబోతోంది
భయంకర సముద్రం వికటాట్టహాసంచేస్తుంటే
తిరస్కారంతో తరగల నురుగులు
పరుగులెత్తుతుంటే—
ఆస్వాదించిన అనుభవమంతా
ఎముకల ప్రోవులై పోతూఉంది
వాస్తవాన్ని ఆశ్లేషించిన రక్తమాంసాల్ని
కాలపుతోడేలు పూర్తిగా నాకివేసింది--
మనసొకకోడై విశ్వపు వక్రరేఖమీద
కూర్చుని
అవసరంలేని చింతల సంతతుల్ని
పొదుగుతూ ఉంది—

నా కుఱచనీడని చూడటానికి
నాకే అసహ్యంగా ఉంది
ఓ భగవంతుడా !
ఈ నీడని నరకవోయ్ ఒక గొడ్డలివై...
జీవం ఏజీవంతో స్పందిస్తుందో
ఆ జీవకిరణ స్వరూపిణీ !
శాంతీ !
నీవునన్ను మోసంచేస్తున్నావు
నా కాంతుల్ని భ్రాంతులుచేస్తున్నావ్--
ఎందుకురావు ?
ఈ తిరోగమించే ఆశలు
ఈ జ్వలించెకోరికలు మిళితమైన
ఈ దయనీయ నాటికపై
యవనిక ఎందుకు జార్పవు ?

ఏవో చినుకులు

నిన్నూహించి రెండుముక్కలు చెపితే
అవేరెండు రెక్కలయి- ఊహా
విహాయసంలో కెగిరిపోతుంది
అదే ఒకగీతం అవుతుంది
అదేప్రేమ కపోతం అవుతుంది--
కలల తామరరేకుల్లో నిదురించే
మధువు వధువై నిలుస్తుందా
పూలవాడల్లో పుస్సాడి బాటల్లో
దొరికిన ఒకశబల మనఃశకలిక
ఈ జీవన మేఘాల్లో ఇంద్రధనుస్సౌతుందా ?
ఆ మత్తెక్కిన అవ్యక్తక్షణాల తెరల్లోనించి
నావైపు గంతులేస్తున్న ఆకళ్ళెవరివి
కొండవాగుల పలచటి కెరటాల్లో
చలించే చేపల్లాంటి కళ్ళెవరివి ?
యుగయుగాలు నీకోసంవెతికాను
ప్రత్యూష ।పదోషాల రంగులపొలిమేరల్లో
ఆశలూ ఆకర్షణలూ లేని ఎడారుల్లో
వెన్నెల పొరలాడే పచ్చిక బయళ్ళలో;
మబ్బుల మందలు ఆకాశపు బయిళ్ళలో

పరుగులెత్తుతున్నప్పుడు
చిన్నకుల పిల్లలగుంపులు, పందిటి
ముందట చిందులాడుతున్నప్పుడు
శీతలవాయువు కిటికీలో
ఈలలు వేస్తున్నప్పుడు
మది దిగులుతో క్రుంగిపోతుంది
వాననీటి పాయల్లో
రాత్రి వెలుగునీడల్లో
ఒంటరిగా పోయే
కాగితపు పడవలో
కలసి వెళ్ళిపోతుంది—
విధి నాయెదపై విసిరిన ఎర్రగులాబీ!
వెన్నెల పోగులతో చీరలల్లేను
తారలతో దండగ్రుచ్చాను
కవితల పయస్సులతో హృదయపాత్ర నింపేను
నీ మృదుపద విన్యాసాలకు తలపులు
పూలచాపగా పరచాను
మెల్లగా రా! చల్లగా రా!
ఓ ఎర్రగులాబీ!
కొమ్మల్లో నిదురించే కుసుమసమూహాల
పరిమళ నిశ్శ్వాసాల్లో పరవశిస్తోంది నిశ్శబ్దం;
యెద దీపావళి చిచ్చుబుడ్డిలా
వెలుగుల పూలు విరజిమ్ముతోంది
వెన్నెల లుమిసే విహాయసంలోకి;

కలలు కన్నీటిలో జలకాలాడుతున్నాయి—
ఈ మిగిలిన క్షణాలుకూడా రాలిపోకముందే
రా: నీతెలి తామరపూవు తనువును నా
ఉచ్ఛ్వాస నిశ్శ్వాసాల ఊయ్యేలలో
ఊపుతాను.

నా గుండెకొర్చిన రక్తపూరంలో
తడిసింది సంధ్యాప్రతీచి చీర—
అనురాగంలో నిశాపూరం కలిపి
జీవనచషకంలో నింపుకుని
సుఖదుఃఖాల మఖమల్ దుస్తులతో
బాధామయగాధల జరీతలపాగదాల్చి
కాలపుగుమ్మంలో కునుకుతూ
కూర్చున్నాను.

నా చూపులు నీ మోముపై పడినప్పుడే
నిదుర నా కన్నులు విడిచింది;
అంతఃస్నాయువులు కోమల తంత్రులై
మధుర రాగాలొలుకుతున్నాయి
యెదమృదంగ ధ్వనులు పలుకుతూ ఉంది;
వీచులై త్రాచులై రక్తం నృత్యంచేస్తోంది.
ఈ శిథిలాలయంలో ఆశల అగరు ధూపంవేశాను
తరుముకునివచ్చే చరమనిమేషాంధ కారంలో
రెండుచేతుల్లో ప్రాణజ్యోతిని పట్టుకొని
నీ కోసమే
ఎదురు చూస్తున్నాను.

ఈ రాత్రి

ఈనాటి చంద్రుడ్ని మరచిపోలేను
ఏ నాటి అర్థాలో త్రవ్వి తెస్తున్నాడు
ఈ తారలు తోరణాలై నా అనుభూతి పండుగలో
పాల్గొంటున్నాయి.
ఈ గాలి ఏ పూల సందేశాలు మోసికొని వచ్చిందో
ఎప్పుడో ఎక్కడో నేను పారేసుకొన్న
మధుమాసాన్ని గుర్తుకు తెస్తూ ఉంది
ఈ తావు లే యెదల వ్యధలు పెనవేసుకుని
వచ్చాయో
ఒకప్పుడు నా అగాధాల్లోకి జారిపోయిన
దేదో లోపల గ్రుచ్చుకుంటూ ఉంది.
జడివెన్నెల వాన జల్లుల్లో తడిసి వచ్చిన
కోర్కెల రెక్కలచప్పుళ్లు
నిశ్శబ్దపు సాలీడు గూళ్లు కట్టుకుంటున్న
నా గుండెల మండువాలో వినబడుతున్నాయి—
కనుగొనల్లో తొంగి చూచిందొక అశ్రువు,
ఒక విధుర విషాద దూతిక, గత జీవిత
ఇంద్రచాపకాంతులు విరజిమ్ముతూ
చెక్కిలిమీదికి అవతరిస్తోంది షోకుగా

అది పోతే పోయింది, ఇన్ని
గుర్తులు విడిచిపోవాలా!
ఒక వేయి పరిమళాలు, వేయి గుసగుసలు
లక్ష రంగులు, ఎంత ఇంద్రజాలం
వెనక మిగిల్చిపోయింది!
అది పోయింది కానీ, కన్నుల్లో నిల్చిపోయింది.
అతి నాజూకుగా ఏదో గీతిక నన్ను చేరుతూ ఉంది.
నఖ శిఖపర్యంతమూ వేయి కోమల హస్తాలతో
స్పృశిస్తూ లాలిస్తూ ఉంది.
మనస్సు వెళ్లిపోయిందెక్కడికో మమతల
పందిళ్లలో మల్లెపూలేరు కునేందుకు
కాలదూరాల తీరాలు విడిచి స్పృహ
అనుభూతిలో జలకాలాడుతూ ఉంది—
మింటి నడుమనున్న సూర్యుడికంటె
కొండలమాటుకు వెడుతూ మిగిలిన
సూర్యుడి ముక్కలో అందమెక్కువ
ఆ ముక్కలోకంటె సూర్యుడే పోగా
మిగిలిన సంధ్యారాగ రేఖల్లో
సోయగం హెచ్చు
వినబడే గీతికంటె గీతి విడిచిపోయిన
తలపుల మెలపుల్లో లోలత హెచ్చు
బాధకంటె బాధ మిగిల్చిన గాఢకు పదునెక్కువ
గాయంకంటె మచ్చకు గొంతెక్కువ
అనుభూతి కంటె స్మృతి బలీయం

పిలిసీడలు మెదలే తన విశాల నేత్రాలు విప్పి
ఈ రాత్రి నాతో గుసగుసలాడుతూ ఉంది
ఈ రాత్రి ఒక సుందర దృశ్యం మాత్రమే కాదు
సుఖము దుఃఖము అందము ఆనందము
ఆశ విషాదము వేడుక వేదన స్మృతి విస్మృతి
అన్నీ కలిసి తమ జీవరక్తం పిండి
పండించిన ఒక అవ్యక్త మధుర క్షణం
తాళలే నీ రాత్రి భావ మధురిమకు
లొంగిపోతున్నా నాత్మ సరిగమకు
ఇది పన్నీటిలో కడిగిన క్షణం
ఇది గీతికలో తడిసిన రాత్రి...

ఒక్కక్షణం

కాలం చిరునవ్వు నవ్వింది
ముళ్ళ పొదల్లో ఒక పువ్వుపూచింది
మన మీయిగం కన్న కలలం
ఈ క్షణం మన మీ తృషిత
యుగానికిచ్చే సలిలం:
ఏ క్షణంలో నేను జీవితానికి ఋణపడ్డానో
ఆక్షణం నీవు నాకిచ్చింది,
నేను నీకిచ్చింది—
అది గాలి కెగిరిపోయే ఎండుటాకు కాదు
గగనంలో ఎగిరే నీ చంచల చేలాంచల రేఖిక
నన్ను ఎలుగెత్తి పిలిచే ఒకప్రేమ విహంగి
రంగుల రెక్కలు:
దానికోసం నేను బ్రతుకు కానల్లో
పువ్వుల కోనల్లో, దాని నీడనావలా
ప్రాకే తెలితామర కొలకుల కెలకుల్లో
పరుగు లెత్తుతాను—
చూడు నా కళ్ళలోకి
ఆరక్తనదుల కావల, ఆ సిందూర
సంధ్యల కావల, ఏముందో చూడు—

ఆదిగో ఆక్షణాన్ని ఋతువుల గాయాలనించి
కారే రక్తధారలతో తడిపి తెచ్చాను;
ఆ విరిసిన కషాయ సంధ్యామంజుల
కీంజల్కాలనించి త్రెంపుకుని వచ్చాను,
ఆ జీవన దానాన్ని - ఒక్కరాత్రి
ఒక్క పగలు...
సుఖదుఃఖాలకూ రాగద్వేషాలకూ
అవలనిలిచి మది మ్రుచ్చిలించే
ఉన్మీలిత శాద్వల వనభూముల
మీద నిల్చి మనవైపు నవ్వే ఆ
క్షణాన్ని తెచ్చాను—
ఆ ఒక్కక్షణం లేకపోతే, నేను
ఇలా బ్రతుకుతుండే వాడ్ని కాను;
ఈ కాలంలో పుట్టడం మన అదృష్టంకాదు,
మనం పుచ్చుకొనటం కంటె
ఇచ్చుకొనటం ఈయుగ లక్షణం —
ఆంతర కల్లోల సముద్రఘోషలో
కలసిపోతున్నాయి వేదనతో కుమిలే
గగనపు గుసగుసలు;
ఏమిటి ఈ పేజీలు రెపరెప లాడుతున్నాయి
జీవన ఝంఝూప్రభంజనంలో
చేతిలో చిక్కిన విహంగి రెక్కల్లా—
ఆ పేజీల్లో ఏముంది విరిగి పోయిన
మానవతా శిథిలాలు, శిథిలాల్లో విషాద

పారావతాల దైన్య స్వరవలయాలు—
మనస్సు, భయంకర భావ పరంపరలు
వెంటాడుతుంటే
ప్రాణాలకోసం పరుగిడుతోంది
అడవుల్లో రేచులు వెంటాడే హరిణిలా.....
ఈ కాలంలో నీకిచ్చేకానుక
మన జీవన మూలిక–ఇదిగో ఈఒక్క క్షణం
నీ కన్నుల కలువల కొలకుల్లో
వెయ్యి చంద్రవంకలు చూచాను
కలలకు నాకన్నులు తిన్నెలు చేశాను.—
ఒక స్వప్నం అయిన జీవితంలో
నిజంకోసం వెతకబోకు
స్వప్నాన్ని మధురస్వప్నం చేసుకో,
ఆక్షణం వచ్చి పిలిచినప్పుడు
చిరునవ్వుతో వెళ్ళు.....
దుఃఖాలకు అలవాటుపడ్డ నీమది
జైలుకు అలవాటయిన ఖైదీ—
తుఫానుతో గాలితో చీకటితో
చెరలాడు తావెందుకు,
మేఘాలతో ఎందుకు నీకాఖేల?
అదిగో, ప్రత్యూషపు ధవళిమ
నాదోపిట కుంకుమ నింపను వస్తోంది:
ఓ, జీవన తృష్ణా! తిరిగి రా!
ప్రేమరసంతో నీ గొంతుక తడుపుతాను

ఈక్షణాన్ని నిముష నిముషమూ
చప్పరిస్తూ పొదాంపద—
ఈజీవన హాలాహలంలో
రెండు అమృత బిందువులు కలుపుదాంపద;
ఈరాత్రి చీకటి చీరని చింపి
పసిడి కిరణాల తరుణాలలో తడుపుదాం
మరొక రెన్నాళ్ళు బ్రతుకుదాం—
ఈజీవితం ఇలా ఉంటుందనుకున్నానా
ఈక్షణం రానప్పుడు—
నీవు వస్తావను కున్నానా
ఈ శార్వరి తన తమోయవనిక వాల్చి
రాగోదయ మయూఖాల్ని
రానిస్తుందను కున్నానా
నీడలు పారాడే నా కన్నుల్లో
ఈ నిశ్శబ్దపు పడియల్లో
నీరూపురేఖలు పడతాయనుకున్నానా
నీరాక సవ్వడికూడాలేని ఈ రాత్రి
ఈ చక్కటి చిక్కటి రాత్రి.....,

మళ్ళీ వచ్చింది కోకిల

మళ్ళీవచ్చింది కోకిల
తోటల్లో తిరిగే షోకిల,
తెచ్చింది పాథేయంగా ఒక మూట
ఈ బాటసారికి తన తియ్యటి పాట—
ఎంత అందంగా పూచాయి అడవిచెట్లు
గిరుల కురుల్లో, గోమేధికాలు కురిసినట్లు,
తెచ్చి పెంచుకోడానికి ఇల్లులేదు
ఎదలోనే వేసి పూలు పూయించుకుంటా—
ఆ పూలమీద ఎగిరేవి సీతాకోక చిలుకలా
గాలికెగిరే రంగుకాగితాల ముక్కలా,
ఒక వేళ, కాలపు దుమారాని కెగిరిపోయే
తిరిగి రాని యెలబ్రాయపు కలలేమో—
కావలసింది వెదకడానికే బ్రతుకంతా వెచ్చించావు
వెదికింది దొరికేసరికి బ్రతుకు సగం అయిపోయింది,
విధి ముళ్ళదండ మెడలోవేసినా
ఎదనిండా మధువు నింపుకుని
ఎదురొస్తావు చిరునవ్వుతో
చికిలి పిట్టల ఆటలు చిగురుకొమ్మల్లో చూస్తావు
వువ్వులతో చిరునవ్వులు కలుపుతావు.

వెన్నెల పూసుకుంటావు, వేడుక చేసుకుంటావు
పుప్పొడిలో పొర్లాడి వచ్చిన తుమ్మెదలా ఉంటా వెప్పుడూ—
రాళ్ళని రొట్టెలుగా మార్చాలంటావు,
కన్నీళ్ళని కలువల కొలను చెయ్యాలంటావు
నిట్టూర్పుల్ని కుసుమ కింజల్క- మైత్రీకషాయ
కిశోర మారుత వీచికలుగా మలచా లంటావు—
ఇలా కలలెన్నో చిగురుకొమ్మల్లో
చిలుకల్లా ఎగురుతుంటే
నడుస్తుంటావు; నది దారిలోనే
ఆకాశపు గుండె జేవురించి
ఎప్పుడు సూర్యుడు గాయంలో కండలా
కొండల కంటుకుంటాడో
అప్పుడు చీకటితెర వాలుతుంది.
ఈ లోకం కల విలువ, నీవు మోసే శిలువ:
కానీ దేవుడెదురై ఈ ఋతువులో
ఏం కావాలంటే...
పిడికెడు వసంతా లందరికీ భిక్ష పెట్టమంటావు
నీకుమాత్రం ప్రేమించే పెదవులు చాలు నంటావు—

గోపురాలు

మనిషి కన్నుల సంధ్యల్లో ఉషస్సుల్లో
ప్రసరించే
శబలమహా స్వప్నకోమల తూలికలారా!
చూడండి, ఎలా తిమిరహస్తాలతో
కళ్ళనులుముకుంటుహ్నాడో మనిషి:
పాపం! ఈనిరంతర కిరణాన్వేషణలో
అలసి సొలసి జాబిల్లితోకలిసి
నిద్రపోతాడు
ప్రత్యూషాల పొత్తిళ్ళలో మేలుకుంటాడు——
నాకలల్లో శతాబ్దాల కలశాలను
ఆశల గోపురాలను చూపులతో స్పృశించాను
అప్పుడు విశ్వకాలాంతరాళాల్లో ఎక్కడివో
ఎప్పటివో బొంగురువోయిన ప్రతిధ్వనులు
ఉదయించి నాకలల అడుగుల మీద వాలుతాయి
ఏమిటి ఈకోలం ఇంతనిష్ఫలం అవుతూ ఉంది
విశ్వబ్దం నాగీతికల నిట్టూర్పుల్లో ఇలా
ఎందుకు నిద్రిస్తోంది?
ఉదాసీనంగా ఈ చేతులతో ఒక యుగానికి
ఉద్వాసన చెప్పవలసి వస్తోంది

ఈ బురుజుల్ని ఈ గోపురాల్ని
తిరస్కారంగా చూడవద్దు
అవి శతాబ్దాల స్ఫటికాలనించి మలచిన
ఆశల ఇటికలతో నిర్మించుకున్న
అభ్రంకష సువర్ణ శిఖరాలు —
ఆ గోపురాల గులాబీ చెక్కుల మీద
మానవతా చుంబన చిహ్నాలు నేడుకూడా
జ్వలిస్తున్నాయి
ఓ స్వప్న తూలికలారా!
మీకోసం చూచే
మా కన్నుల రంగుల చేపల మీదికి
ఎందుకిలా కన్నీటివలలు విసురుతారు
మనిషి కళ్ళు తడిశాయి
దేవుడి కళ్ళు తడిశాయి
వచ్చేతరాల కళ్ళుకూడా ఎందుకు తడుపుతారు
మా యినప సరాల తీగెలు త్రెంపకండి
అందులో నిదురించే గొంతు జాగృతమైతే
మండే సూర్యుడు రెండు ముక్కలుగా విరిగి
మనిషి కళ్ళుగా మారుతాడు
ఆకాశం కూలిపోతుంది
సముద్రాలు పారిపోతాయ్
ఎందుకు జాగుచేస్తారు
రండి మా గుమ్మానికి తోరణాలు కట్టండి
మానవ జీవితాన్నొక మహోత్సవం చేయండి.

వెన్నెల వ్యథ

మబ్బుల వలువలు విడిచి
రాత్రి నగ్నంగా వెన్నెట్లో స్నానం చేస్తూ ఉంది;
పూల నెత్తావులతో గాలి గుసగుసలాడుతూ ఉంది;
నీవు వస్తావన్న నిరీక్షామధువు చప్పరిస్తూ
ఎద మత్తులో ఒత్తిగిల్లింది;
కలలెగిరిపోతాయేమో అని
కన్నులు ముకుళించాయి, రేకుల్లో
తేనె దాచుకున్న పుండరీకాల్లా—
మల్లెపొదకు తగులుకున్న దేశద్రిమ్మరి చంద్రిక
నీ నెమ్మేని వలువ అని నా చేయి పట్టుకోబోయింది.
దూరాన కొండలమీద కురిసిన వెన్నెల జాడల్లో
నీ అడుగులకై పరుగిడినై, నా అలసిన చూపులు;
కానీ, ఊడలు విరిసిన మర్రినీడల
దట్టపు చీకట్లలో చిక్కుకున్నాయవి.
కలలతోటే వెన్నెలలంతా వ్యయమైపోతే
నీవొచ్చేసరికి మిగిలిం దేమిటి?
భ్రమ తొలగిన బ్రతుకు
నీరు వదలిన తామరకొలను
ఇంద్రధనుస్సును తలపాగగా చుట్టుకున్నవాడు

చల్లని వెన్నెలచొక్కా సమకూర్చుకోలేకపోయాడు:
మబ్బులు మఖమల్ జోళ్లుగా మలుచుకోబోయి
కంటక పాషాణపథాల్లో
ఒంటరి బాటసారిగా మిగిలాడు:
కల లెగిరిపోయిన నేత్రాలు
పక్షులు లేని గూళ్లులా బావురుమన్నాయి;
గగనంలో నర్తించే తారల సమూహాలమీద
ఉషస్సు అరుణ కిరణాల వల విసరివేసింది.

ఉషస్

ఎన్నాళ్ళకు మా అతిథివిగా వచ్చావు
ఈ శిథిల కుటీరాని కింత వెలుతురు తెచ్చావు
గగనానికి నీలిమ పూశావు
గాలికి పుప్పొడి రాశావు
జగతి మీద శాద్వలాలు పరచావు
బాటల్లో తోటల్లో పువ్వులు చల్లావు
గ్రుక్కెడు నిశ్శబ్దం త్రాగి, చిరిగిన
చీకట్లు కప్పుకొని పడున్న నాకు
కమ్మని ఆశామధురిమ కానుకగా తెచ్చావు—
తలపుల సీతాకోక చిలుకలకు పూలపీటలమీద
ప్రభాత కిరణాలతో అభ్యంగనం చేయించావు——
పూల కొమ్మల్లో గుసగుసలాడే కోర్కెలతో
కలసి జిలిబిలి గీతిక లల్లావు—
కారుమబ్బులు కప్పిన గగనపు గుమ్మానికి
ఇంద్ర ధనుస్సులతో రంగుల తోరణాలు కట్టావు.
ఆశ నిరాశల నూలుపోగులతో అల్లిన జీవితాన్ని
మధురక్షణాల జరీపూల బుటాలతో
అలంకరించావు——
సంజకెంజాయల్లో బెరసిన సన్న చీకట్లు

జీరలు చూపి
వెతలలో ఉన్న చిరుచేదు రుచి చవి చూపించావు--
కన్నీటి తెరల మాటున కదలే పేదచూపులు
కవితల కాలవాలమని చెప్పావు-
అంగూరు చితకందే ఆసవం రాదని
చెఱుకు నలగందే శీధువు వెలువడదనీ
చితికిన బ్రతుకు లోతు ఆవిష్కరించావు
వ్యధను కళ్ళకద్దుకున్న మనిషి
బ్రతుకు తనకు బానిసైనవాడని తెలిపావు.
ఆత్మ అనే మంచుముక్కను అందులో కరిగించి
ప్రేమ పూర్ణ పాత్రిక అందివ్వ మన్నావు.

నిశ తెచ్చిన కానుక

చిరునవ్వులా చిందే తారకలతో
సింపుకున్నావు నీ శూన్యాన్ని
బరువైన కన్నీటి బిందువులతో
సింపేవు నా శూన్యాన్ని:
అరవిరిసిన నెత్తావులతో
బుగులొక్కల్పేవు నీ గాలిని
ప్రిదిలిన ఎద వదలిన వేడి నిట్టూర్పులతో
రగులొక్కల్పేవు నాజోలిని;
కోమల మలయ సమీరంతో
రెక్కలు సంతరించుకున్నావు నీవేళకు
నిత్యజీవన శిలలతో నిగళాలు
వేశావు నా కాళ్ళకు;
కొందరికే తెలుసు జీవిత శక్రచాపం
వెనకున్న నగ్నత
కాని తప్ప దెవరికీ ఆ రంగుల
వలలో నిమగ్నత;
ఏది ఎందుకు తారసిల్లుతుందో
ఎవరూ చెప్పలేనిది బ్రతుకు!
కారణాలను కళ్ళకందని విదూర

తీరాల సీమల్లో వెతుకు:
విశ్వబ్ది నిశా మధుశాల నించి
వీచే సురభిళ వాయువీచిక
తూరుపు తెరల్లో మేల్కొలిపింది
ఉషశ్శారిక కోరిక;
మరుభూముల ఇసుకల్లో
నడిచే ఓ బాటసారీ!
దొరక దనుకోకు కలువలు
విచ్చిన చల్లని కాసారవారి.

ఆ రోజు

(ఇందిరకు జన్మదిన కానుకగా)

ఇది అదే రోజు
ఎండమావుల్ని వరిస్తూ
నీలి దీవుల్ని స్పృశిస్తూ
ఆశల విస్ఫులింగాలని కన్నుల
గిన్నెల్లో నింపుకుని
వచ్చింది—
ఈ రోజు మళ్ళీమళ్ళీ అనేక
శరత్తులదాకా ఇలాగే వస్తూ ఉండాలి;
నా యెదలో పచ్చటి శాద్వలాలు, ఊపిరిపీల్చే
మరకతాల పొలంగా నిలవాలంటే
జీవకాంతు లొలుకుతూ
దేవకాంతల్ని నాట్యానికి పిలవాలంటే
అనేక శరత్తులదాకా ఈ రోజు
ఇలాగే వస్తూ ఉండాలి
ఈ రోజే నా ప్రాచీ రేఖ మీద ఒకతార
ఉదయించడం చూచింది
ఈ రోజే సీతల్లి అధరాధర శాఖ మీద
ఒక దరహాసం వికసించడం చూచింది
ఈ రోజే సీ ముఖ బింబంమీద

తుపాను వీచే జీవన సంద్రంలో
మమతల కెరటాల మీద తేలే ఒక
నావను చూచింది
ఒక్కరోజే కావచ్చు కానీ
అది చరిత్ర పెదవుల్ని చుంబించింది
రెండు కిరణాల్ని ముడివేసి అక్షర జగత్తు
మెడలో వేసింది,
చంచలమైన నా యింద్రియాల
గిన్నెలనిండా వెన్నెల నింపింది
నాకు తెలుసు ఈ రోజు ఉభయ ప్రపంచాల
కవితా పేజీల్లో
సువర్ణాక్షరాల మాల వేయించుకుంటుందని

మనసే ఒక మధుమాసం

వచ్చాయి పూల బంధువులు
తెచ్చాయి తేనె బిందువులు
పిలిచాయి విందు కిద్దరిని
పోదాము ప్రేమ నిర్ఝరిణీ—
అటు చూడు కొండలంతా
ఇటు చూడు కోనలంతా
ఎటు చూడు: జగమ్మంతా
రంగేళీ పూలసంత—
[గుండె గాయాలు చిరునవ్వులతో కప్పుకో
పాత స్వప్నాల హారాన్ని దులిపి మెడలో ధరించుకో
కార్చే కన్నీళ్ళు కనురెప్పల్లోనే దాచుకో]
అవి బ్రతుకు కడలి ముత్యాలు
మన జీవిత సత్యాలు—
పోదాము ప్రేమ నిర్ఝరిణీ
పిలిచాయి విందు కిద్దరిని....
పరాగాల షికాను
పరిమళాల తుఫాను
నేను నేటి సుల్తాను
గతం మరచిపోతాను—

ఇది రంగుల నెల పరిమళాల నెల పువ్వుల నెల నవ్వుల నెల]
చూడు, జీవితం ఎక్కుపెట్టిన ధనుస్సులా ఉంది.
వడిగా కొండల ఒడిలో దూకే జలపాతాలు

మన ప్రేమకు సంకేతాలు]
చేరుదము పూల మేళా
ఊగుద మాళల డోల—
గులాబీల ఉదయాలు
కుంకుమ అస్తమయాలు
బుల్బులి జిలిబిలి పాటలు
జగమే మన రంగుల గూడు—
చుక్కల గుంపుల్లో ఉన్నా జాబిలి
గగనంలో ఒంటరి బాటసారి;

నీవు రాకుంటే]
కొమ్మల్లో తెమ్మెరలేదు
పక్షుల్లో పాటలు లేవు
తోటల్లో పువ్వులు లేవు
బాటల్లో వెలుగులు లేవు—
[నీనవ మృదులాంగుళి అందిస్తే
నీ చూపుల పన్నీటి జల్లు చల్లితే
పూలు కలకల నవ్వుతాయి
పక్షులు పాడుతాయి
జీవిత పథాల్లో చైత్రం

వెల్లి విరుస్తుంది]

కాలువలో పూల పడవలం
కొమ్మల్లో జంట పక్షులం
తోటల్లో తేనేటిగలం
పందిట్లో పూల తీగెలం—
బ్రతుకే ఒక దరహాసం
మనసే ఒక మధుమాసం...
పోదాము ప్రేమ నిర్ఝరిణి
పిలిచాయి విందు కిద్దరిని—
ఒక క్షణం మధుర క్షణము
ఒక క్షణం చేదు క్షణము
బ్రతుకొక అతుకుల బొంత
శేషేంద్రకు నీవే అంతా—
పోదాము...

గా లు లు

ఈ ఉషస్సు ఎన్నితీరాలు ఎన్ని తుఫానులు
ఎన్ని ఉదయా స్తమయాలు దాటివచ్చిందో
నలుదిక్కులా మునిరి విసిరే ఈ నూతన
వన పవనాలతో కలిసి—
మన మెరుగని చూపులు మనంచూడని నడకలు
మనం నడవని బాటలు సంతరించుకుని
ఒక కొత్త గొంతెత్తి కేక వేస్తోంది
అది ఒక కొత్తకల అది ఒక కొత్తఅల:
నవయుగ ప్రాచీ రేఖమీద విరిసిన కల
విరుచుకు పడ్డ అల...
ఈ ఉషస్సు కురిసే రక్తిమలో
స్నానంచేసి మానవుడు శుచి ఐ
ఆకాశాన్ని తన్నే సముద్రతరంగంలా
మనతీరాల మీద విరుచుకుపడుతున్నాడు:
మానవతని విభజించే ఇనపతెరల్ని త్రెంచి
దళిత జీవుల మొరల్ని
ఒరల్లో ఖడ్గాలుగా ధరిస్తున్నాడు.
ఓహ్! మన మనోద్వారతోరణానికి
మానవతా సూర్యుడు జ్వలత్ జ్వాలా గుఱుచ్ఛమై

ప్రేలాడు తున్నాడు—
భాషలు ఆరవేసిన వలువల్లా ఎగిరిపోతున్నాయి
దేశాల సరిహద్దులు ఈ ఝుంఝూమారుతాల ధాటికి
గజగజ వణికిపోతున్నాయి
మానవత నగ్నంగా ఉద్విగ్నంగా
నూతన వ్యక్తీకరణ కోసం చూస్తోంది
దిశాంచలాల్లోకి.....

మనిషి

ఇవాళ ఒక బాధా సూర్యుడు అస్తమిస్తే
రేపు మరొక తీక్షణమైన బాధా సూర్యుడు
ఉదయిస్తున్నాడు;
నిదురించే కన్నుల లోకాల్లో నిప్పులు రగిలిస్తున్నాడు...
మరునాడు ఉషస్సు ఏ ఏ ముఖాలతో మరలివస్తుందో
నాకు తెలీదు
నిన్న నీటిబొట్లు కారుస్తున్న చెట్లు ఇవాళ
జ్వలించే పూలకత్తులు ఝళిపిస్తున్నాయి
నిన్న జీవం ఘనీభవించిన కొండవాగుల్లో
ఇవాళ అలలుకన్న కలల్లా చేపలశవాలు శివాలాడుతున్నాయి
నిన్న మంచుపొరలు మల్లె నిట్టూర్పులు
అల్లిన వలువల్లో వగచిన రాత్రి ఇవాళ
చంద్రకిరణాల మీద స్వారిచేస్తూ
ఆకలి పండించిన పంట చేలమీదుగా ఒక
అప్సరసలా వెడుతోంది
ఏ అదృశ్యహస్తం ప్రకృతినిలా
చైత్రించిందో
గాయాల బొంగురువోయిన గొంతుల్లో
ఖడ్గాల్లాంటి గానాలు అలంకరిస్తోంది

విధుర మధుశాలగా మారిన ఈ విశ్వవీధుల్లో
కూర్చుని నామది
తిమిరకన్యలతో ఖేలలాడుతూ ఉంది
ఏకాంతతలో ఓలలాడుతూ ఉంది
జ్ఞాపకాల గవాక్షాల నించి చూస్తే
గాయాలుచేసుకున్న గడచిన రోజులు
రక్తాభిషేకం చేసుకున్న రాజులు
లోకంలో ఉన్న ప్రతిబాధా నాగుండెనే
ఎందుకు ఆశ్రయిస్తుందో!
నే నిప్పుడు చేరిన మజిలీలో
సుఖానికీ దుఃఖానికీ భేదం లేదు
మృత్యువుతో రాజీ పడ్డవాడికి
ఇదంతా ఒక తమాషా...
జీవితపు అడుగుల్లో నడిచే కాలమీ
నా కాళ్ళు కాలపు ఉక్కుసంకెళ్ళని
ధిక్కరించలేక పోతున్నాయి.
నా కళ్ళముందు జరిగే ఈ విధ్వంసంలో
మానవత, గతచరిత్ర పేజీల్లో కలిసిపోతోంది.
మనిషిని మనిషి ద్వేషించే ఈ రోజుల
రక్తనాళాల్లో రక్తంకాదు
విషం ప్రవహిస్తోంది
నేను మాత్రం ఇదంతామోస్తూ
ఇంకా ఉదయించని ఉషస్తారకోసం చూస్తూ
కాళ్ళీడ్చుకుంటూ
కఠిన శిలా శిఖరాలకు ప్రాకుతున్నాను.

తరాల తరంగాలు

ఒక తరాన్ని ప్రసవింపజేయడమంటే ఒక తమాషాకాదు;
ఒకవిండు కలల జగత్తునే మేల్కొల్పడం
ఎన్నో అసంఖ్యాక అవ్యక్త ఆత్మలు
ఎన్నో చిత్ర విచిత్రానుభూతుల ఒడిలో
స్పందనపొందిన తరుణాల స్వరాలు ఈ తరాలు
అవి సృష్టి అనంత వీచికలు
జీవన పర్వత శ్రేణులొరసి ప్రహించే
కాల ఝరులు
పేరులేని ఏ చరమ గమ్యానికో పోయే కలల బిడారులు—
చంద్రకిరణం అడవి ఏకాంతతలో
తనువు ధనువుచేసి ఆవులించి
వృక్షాల పీపులకు రాచుకుంటూ సుఖాన్ని చుంబించేవేళ,
ప్రతీచి, నెరసుజకెంజాయల మంజుల కింజల్క—
వల్క—లాల్లో కుల్కే—వేళ
ఏ గుడిసెలోనో నిశ ఉషతో సెలవు పుచ్చుకునే వేళ
మానవ అవయవాలు నరికిన కొమ్మల్లా తెంచిన ఆకుల్లా
వెదజల్లిన మైదానాల్లో ఖాంఖుల పొగ మోసిమోసి
ఇక మోయలేక
గాలి జాలిగా కూలిపోయే వేళ

ఈ వేళల ఊళల రూపాంతరాలు తరాలు—
నవతరానికి ఏ సంపద విడిచిపెట్టాము
యుద్ధము రక్తము కన్నీరుతప్ప,
గాయాలు బాధలు వేదనలు తప్ప,
కలలు కలలు కలలు తప్ప
పిరికితనం మోసం తప్ప—
వాళ్ళ మనస్సులు శరీరాలు ఆరోగ్యంగా పెరగనివ్వండి
వారే మన పిపాసిత పెదవులకు
ఉపాసిత సూర్యలోకాల్నించి
సముద్రాలు తెచ్చి అందిస్తారు.—

నిదుర లోయల్లో

నిదురిదామని
మది తలుపులు మూసి
చంద్రుడ్ని ఆర్పివేసి
తారలతెర జారవేసి
ఒలికిపోయిన కథలా పడుకున్నా
దూరాన సముద్రపురొద పంఖాగా —
సంధ్యారాగ రక్తిమను కబళించిన
నీలిజలాల ఒడ్డున
జ్ఞాపకాలు నాలికలు జాపి
గాయాల్ని నాక్కుంటూ పడుకున్నాయి
చూచావుగదా
ఓ విషాదంతో నిండిన పాత్రా ! నిన్ను
చీకటితోనిండిన శార్వరీలా ప్రేమిస్తాను
జీవన సమరంలో అలసివచ్చి
తారల వెలుతురు కలిపిన నీ తిమిరంలో
స్నానం చేస్తాను,
ఆనాడు నాఏకాంత దర్పణ మందిరంలో
ఎన్ని వన్నెలు వెదజల్లేవు
ఎన్ని రూపాలు ప్రసరింపజేశావు

నిశ్శబ్దాన్ని కలతో గీతికలతో
మధురింపజేశావు
హింసించే ఏకాకితనించి ఎన్ని
మధురక్షణాల దండల్లి నా గుండెల
కర్పించావు
నీ కుంచెతో విసిరికొట్టిన రంగులు
నీలి మబ్బుల్లో ఇంద్ర ధనుస్సులై ఊగిసలాడుతున్నై
ఇంతకూ–
అనేక వేల జ్యోతులు కళ్ళల్లో నాట్యంచేసే
నీవు—
నీవెవరు ?
నాకెందుకిచ్చా వింత చీకటి !!

అందాల అతిథులు

(నీలగిరిలో 1969లో యూకలిప్టస్ అడవుల్లో కవి ఈ పద్యం వ్రాశాడు)

ఎందుకు వస్తున్నాయి ఈ అందమైన భావాలు
నిశ్శబ్ద బంధురమైన నా మందిరంలోకి–
ఈ అందాల అతిథులకు ఏ ఆతిథ్యం ఇవ్వగలను !
వెన్నెల బాటలు విడిచి వచ్చిన
అప్సరసల గుంపుల్లా వస్తున్నాయి
ద్వారాల్లేని ద్వారబంధాల్లేని ఈ మందిరంలోకి–
ఆకాశపు నిర్మల నీలోదకాల తీరాల నుంచి
దిగివచ్చే లే యెండల పింఛులా
వస్తున్నాయి
విరిగిపోయిన కుర్చీల్లాంటి అనుభవాలు పడున్న
నా జీర్ణమందిరంలోకి–
కొండల్లో కోనల్లో క్రుమ్మరే దేశద్రిమ్మరిగాలి
వేసవి అడవుల్లో రాలిన ఆకుల మీద
చర చరా నడచి వచ్చినట్లు
ఎందుకు వస్తున్నాయి, చెరిగిపోయిన చిత్రాల్లాంటి
స్వప్నాలు వ్రేలాడే ఈ శూన్య మందిరంలోకి–
పక్షుల్లా భ్రమరాల్లా పూల పెదవులు చుంబిస్తూ
తృణ బాలికల శిరస్సులు స్పృశిస్తూ
వస్తున్నాయి

గాలుల దాడికి కప్పెగిరిపోయిన ఈ శిథిల కుడ్యాల్లోకి-
ఏమివ్వగలను ఈ అతిథులకు
కనురెప్పల కొసల మసలే ఒంటరి బాష్పంలాంటి
ఒక గంభీర కంఠస్వర గీతిక తప్ప-
యెదలు భగ్నమైన ఎండలు
శాంతి కోల్పోయిన గాలులు
విషాదం తొణికిసలాడే వానలు
విడిసే ఈ ఎడారి సత్రంలోకి
ఎందుకు వస్తారు మీరు ।
నిర్జన ప్రదేశ వాసిని, లోకాంతరాలనుంచి
వచ్చిన ప్రవాసిని,
నన్నే ఎందుకు వరిస్తారు-
పొండి
సీలాకాశంలో తెలి మబ్బులై పొండి
సాగరాల్లో నావల తెరచాపలై పొండి
దూర తీరాలకు తరలిపోయే పవనాలయిపొండి
రేపటి గులాబీల తోటల్లో
ఉషస్సులై పొండి
పొండి . . . .

శేషేంద్రశర్మ రచనలు

1. **సారాబు:** కవిత. షానామా అనే వర్షియన్ ఇతిహాసంలోని ప్రసిద్ధగాధకు మాత్యూ ఆర్నాల్డ్ చేసిన ఇంగ్లీషు తర్జుమా అనుసరించి తెలుగులో స్వతంత్రానువాదము – (ప్రచురణ 1961) వేంకట పార్వతీశ్వరకవుల ఉపోద్ఘాతం –

2. **ఋతుఘోష:** కవిత. ప్రచురణ 1968, 1969. రాజకుమారి ఇందిరాదేవి ధనరాజ్‌గిర్ చేత ఇంగ్లీషులోకి అనువాదం చేయబడింది. కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి తొలివలుకు–

3. **నరుడు, నక్షత్రాలు:** వైజ్ఞానిక, సాహిత్య, వ్యాసాల సంకలనం. ప్రచురణ 1968

4. **రామయణరహస్యములు:** వాల్మీకి రామాయణంలోని కొన్ని అద్భుత అపూర్వ విశేషాలు ఆవిష్కరించిన గ్రంథం. ప్రచురణ 1964. శ్రీ గుండేరావ్ హర్కారేగారి సంస్కృత పీఠిక.

5. **స్వర్ణహంస:** భట్టహర్ష విరచిత నైషధీయ చరితకు ఒక అపూర్వ వ్యాఖ్యానము. ప్రచురణ 1967. పీఠిక – శ్రీ సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి.

6. **సాహిత్య కౌముది:** తెలుగు ప్రబంధకవులు, వారి కావ్యాలు గురించి అనిదంపూర్వమైన విశేషాలు, సిద్ధాంతాలు ప్రదర్శించే విమర్శ గ్రంథము. ప్రచురణ 1968.

7. **డోహాలు:** సాహిత్య వైజ్ఞానిక వ్యాసాల సంపుటి ప్రచురణ 1969.

8. **పక్షులు:** కవితా సంకలనం. ప్రచురణ 1969.

9. **విహ్వాల:** కథలు; ప్రథమ ముద్రణ 1968. రెండవ ముద్రణ 1972.

10. మబ్బుల్లోదర్శారు : నాటిక ; ప్రథమ ముద్రణ 1963. రెండవ ముద్రణ 1972.

11. చంపూ వినోదిని : హాస్య, వ్యంగ్య, విలాస విశేష పద్య గద్య సమ్మిశ్రిత రచన ప్రథమ ముద్రణ 1968.

12. శేష జ్యోత్స్న : కవితా సంకలనం ; ఇంగ్లీషులోకి రాజ కుమారి ఇందిరాదేవి ధనరాజ్‌గిర్ అనువాదం చేసింది. ఉర్దూలోకి డా॥ గియాజ్‌సిద్దికి అనువదించాడు. ఉర్దూ అనువాదం, హిందీ లిపిలోకి కూడా మార్చబడింది. ఈ గ్రంథం అందుచేత ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ అనువాద సహితం అన్నమాట. ప్రచురణ 1972.

13. విశ్వావివేచన : 'శేను' అనే చైతన్య పరిణామ చరిత్ర; నక్షత్రాలూ నక్షత్రకుటుంబాలతో నిండిన ఈ విశ్వాన్ని గురించి రచయిత వైజ్ఞానిక ఊహలు. ప్రచురణ 1968.

అచ్చులో ఉన్న గ్రంథాలు :


1 మండే సూర్యుడు : కవితా సంపుటి

2. మేఘదూతము : కాళిదాసు కవితకు ఇందిరా ధనరాజ్‌గిర్‌తో కలిసిచేసిన ఆంగ్లానువాదము. వాల్మీకి రామాయణంలోని కొన్ని భాగాల రూపాంతరీకరణల సమ్మేళనమే ఈ కావ్యము అని ఒక అద్భుత పరిశోధనావ్యానంతో కలిపి ప్రకటింపబడుతోంది. ఈ పరిశోధనా వ్యాసము 1970లో జర్మనీలోని ఇండొలాజికల్ యూనివర్సిటీ (గొటింగెన్)లో ఈ రచయిత చేత చదువబడింది.

3. పడవలు-కెరటాలు : (తెలుగులో ప్రెంచికవిత) సుప్రసిద్ధప్రెంచికవి చార్ల్‌స్ బోడిలేర్ కవితకు అనువాదము.

4. తెలుగులో హాఫిజ్ : హాఫిజ్ షిరాజీ పార్సీ కవితకు అనువాదం.

3X



కవిగా ఈలోకానికి వచ్చిన ఒక శిశువు ప్రతివస్తువునుంచి ఎంతోకొంత కవితని పిండుకుంటాడు. మామూలు కావ్యాలకంటె గిరులు, ఝరులు, అహోరాత్రాలు, మహాసముద్రాలు, కాలగుహల్లో ప్రతిధ్వనించే మానవఝుంఝూప్రభంజనాలు-ఘోషించే కావ్యాలకు శేషేంద్రశర్మ తలవంచుతాడు. కాళ్ళని సంకెళ్ళకు, గుండెను గాలివాసలకు అంకితం చేసుకుంటాడు. ఐతిహాపిక తీరాలనుంచి, మానవ సముత్సేక శిఖరాలనుంచి, తరతరాల తరంగాలను, ఖిలమైన శంఖాలను, చిరిగి పోయిన పేజీలను, ఎగిరిపోయిన కర్పూర ధూళులను, ఆరిపోతున్న నాగరికతల హారతులను పోగుచేసుకుంటాడు. అతడు అంధకారంలో ఆక్రందనచేసే పసి పిల్లల కంఠస్వరాల కవితకు నీరై పారిపోతాడు. హోరుగాలుల్లో శివాలాడే శాఖల్లో, నిటారుగా నిలుచుని నినదించే సరివీ చెట్ల సమూహాల్లో విన్న తన ఆదర్శాల గుసగుసలు కవితలుగా అల్లుకుంటాడు. మనిషి తన కలను నిజంగా మలచు కుంటున్నప్పుడు మానవుడు చేసే ఆత్మహత్య గాఢాంధకారంకంటే ఘోరం అంటాడు శేషేంద్రశర్మ.

ఆంధ్రకవితా నవయుగ నిర్మాత మహాకవి శ్రీశ్రీ "నీది పద్యమా లేక ప్రపంచి మద్యమా" అన్నాడు యీయన కవితను గురించి. "ఏదోఒక ఆల్కెమీకోసం వెతుకులాడుతున్న అన్వేషణ కనిపిస్తుంది మీ కవితలో" అంటాడు శ్రీశ్రీ.

Check List

Book Number	PS01K371	Date	3/12/2022
Front Cover	Yes	Back Cover	Yes
Blank Pages	I, II, IV, V, VI, XL, 56		
Missing Pages	NO		
Prepared By	Amrutha	Cutting By	Amrutha
Scanned By	Sruthi	Pages	89